
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
మంగళవారం 19 నవంబరు 2024



సింహాద్రి ఎన్టీపీసీ హెచ్ఓపీగా సమీర్‌శర్మ



సమీర్‌శర్మ

పరవాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సింహాద్రి ఎన్టీపీసీ హెచ్‌ఓపీ (హెడ్ ఆఫ్ ద ప్రాజెక్టు)గా సమీర్ శర్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మధ్యప్రదేశ్‌లోని వింధ్యాచల్ ఎన్టీపీసీ థర్మల్ పవర్ ప్లాంట్ ఓఅండ్‌ఎం విభాగ సీజీఎంగా పని చేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. 1988లో ఎన్టీపీసీలో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన సమీర్‌శర్మ అనేక కీలక పదవులు నిర్వహించారు. సింహాద్రి ప్రాజెక్టు పురోభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.

అచ్యుతాపురంలో మెగా పవర్ ప్లాంట్

ప్రత్యేక ఆర్థిక మండలిలో ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్

- నిర్మాణ వ్యయం రూ.85 వేల కోట్లు
- ఉత్పత్తి సామర్థ్యం 80 గిగావాట్లు
- 25 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- ఈ నెల 29న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా శంకుస్థాపన
- గత టీడీపీ హయాంలోనే బొగ్గు ఆధారిత పవర్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు
- ఎన్టీపీసీకి 1,200 ఎకరాలు కేటాయింపు.. బొగ్గు దిగుమతిపై కేంద్రం ఆంక్షలు
- వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత తెరమరుగైన ప్రాజెక్టు
- కూటమి ప్రభుత్వం రాకతో మళ్లీ కదలిక



ఎన్టీపీసీకి గత టీడీపీ హయాంలో కేటాయించిన భూమి

అచ్యుతాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): **దాదాపు పదేళ్ల క్రితం చంద్రబాబునాయుడు కృషితో మంజూరైన ఎన్టీపీపీ పవర్ ప్రాజెక్టు ఎట్టకేలకు పట్టాలు ఎక్కనున్నది. గతంలో బొగ్గు ఆధారిత పవర్ ప్లాంట్‌కు ఆమోదం లభించగా, గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతోపాటువివిధ కారణాల వల్ల ప్లాంట్ నిర్మాణం జరగలేదు. ఈ నేపథ్యంలో చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ఆయన చొరవతో ఎన్టీపీసీ ప్రాజెక్టుకు కదలిక వచ్చింది. అయితే ఈసారి బొగ్గు ఆధారంగా కాకుండా పర్యావరణ హితంతో గ్రీన్ హైడ్రోజన్ హబ్‌ను ఏర్పాటు చేయబోతున్నారు. రూ.85 వేల కోట్ల పెట్టుబడితో 80 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తితో ఏర్పాటయ్యే ఈ ప్రాజెక్టు వల్ల 25 వేల మంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ నెల 29వ తేదీన ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్ నిర్మాణానికి శంకుస్థాపన జరగనునన్నది. ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం..**

పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్ఈజడ్)లో అత్యాధునిక సూపర్ పవర్ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని 2014లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యోచించారు. కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇందుకు ఆమోదం లభించడంతో 2015లో రాంబిల్లి మండలం పూడి గ్రామం వద్ద ఎస్ఈజడ్‌లో 1,200 ఎకరాలను ఎన్టీపీసీకి కేటాయించారు. ఇందుకుగాను సంస్థ రూ.700 కోట్లు ఏపీఐఐసీకి చెల్లించింది. ఇక్కడ ఒక్కొక్కటి వెయ్యి మెగావాట్ల సామర్థ్యంలో నాలుగు యూనిట్ల ద్వారా నాలుగు వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలన్నది ప్రణాళిక. నిర్మాణ వ్యయం రూ.28,828.29 కోట్లుగా అంచనా వేశారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ కోసం ఆస్ట్రేలియా నుంచి నాణ్యమైన బొగ్గును దిగుమతి చేసుకోవాలని ప్రతిపాదించారు. ఇందుకోసం పూడిమడక వద్ద హార్బర్ నిర్మించాలని టీడీపీ ప్రభుత్వం యోచించి రూ.300 కోట్లు ... మిగతా 8వ పేజీలో

ప్రధాని రాకతో రోడ్లకు మెరుగులు

- ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్ శంకుస్థాపనకు 29వ తేదీన మోదీ రాక
- సెజ్ ప్రధాన రహదారికి అత్యవసరంగా మరమ్మతులు



ఎస్ఈజెడ్ ముఖద్వారం వద్ద రోడ్డు మరమ్మతు పనులు

అచ్యుతాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పూడిమడక వద్ద ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి ఈ నెల 29వ తేదీన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇక్కడకు రానుండడంతో ప్రత్యేక ఆర్థిక మండలి ప్రధాన రహదారి మరమ్మతులకు ఏపీఐఐసీ అధికారులు నడుం బిగించారు. రోడ్డు ఎగుడుదిగుడుగా వున్నచోట ఎక్స్‌కవేటర్లతో తవ్వేసి, కొత్త లేయర్ వేయనున్నారు.

అచ్యుతాపురం జంక్షన్ నుంచి పూడిమడక వరకు ఏపీఐఐసీ గతంలో నాలుగు లేన్ల రోడ్డు నిర్మించింది. కర్మాగారాలకు వచ్చే భారీ వాహనాలతోపాటు కార్మికులు, ఉద్యోగులను తీసుకువచ్చే వందలాది బస్సులు నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో ఎస్ఈజడ్ ముఖ ద్వారం వద్ద నుంచి రోడ్డు బాగా పాడైపోయింది. ఏపీఐఐసీ కార్యాలయం ముందు భారీ గోతులు ఏర్పడ్డాయి. ఇంకా ఏషియన్ పెయింట్స్ కర్మాగారం నుంచి పూడిమడక వరకు మూడు కిలోమీటర్ల రోడ్డు, బ్రాండిక్స్ వద్ద రోడ్డు తీవ్రంగా దెబ్బతిన్నది. దీంతో అన్ని రకాల వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో పూడిమడక సమీపంలో ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్ నిర్మాణానికి ఈ నెల 29వ తేదీన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయనున్నారు. దీంతో ఏపీఐఐసీ అధికారులు నాలుగు లేన్ల రహదారికి మరమ్మతు పనులు చేపట్టారు. రహదారిని బాగు చేస్తుండడంతో వాహనదారులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

అర్హులందరికీ సంక్షేమం

జిల్లా వ్యాప్తంగా ఇంటింటా సర్వే

- వివరాలు సేకరిస్తున్న వార్డు/ గ్రామ సచివాలయాల సిబ్బంది
- కుటుంబ సభ్యుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు, జియో ట్యాగ్
- ఈ నెల 24వ తేదీనాటికి సర్వే పూర్తి
- సూపర్-6తోపాటు అన్ని పథకాలకు అర్హుల గుర్తింపు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)



నర్సీపట్నం మండలం వేములపూడిలో ఒక కుటుంబం వివరాలను సేకరించి జియో ట్యాగ్ చేస్తున్న సచివాలయ ఉద్యోగి

గత వైసీపీ ప్రభుత్వం వలంటీరు వ్యవస్థను అడ్డంపెట్టుకుని పలుచోట్ల వైసీపీకి అనుకూలంగా వున్న వారికే సంక్షేమ పథకాలు అందించింది. ఏవేవో కుంటి సాకులు చెప్పి ఇతర రాజకీయ పార్టీ మద్దతుదారులకు సంక్షేమ పథకాలను అందకుండా చేసింది. కుటుంబ సభ్యుల వివరాల నమోదును మొక్కుబడిగా కానిచ్చారు. దీంతో పలు గ్రామాల్లో అర్హతలున్న ఎంతో మంది ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైసీపీ ప్రభుత్వ బాధితులంతా తమకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదులు చేస్తున్నారు. అర్హులందరికీ సూపర్-6తో అన్ని రకాల సంక్షేమ పథకాలను అందించడానికి కూటమి ప్రభుత్వం కుటుంబాల వివరాలను సేకరిస్తున్నది.

పేదల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పయనిస్తున్నది. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నది. ఇందులో భాగంగా ఇంటింటా జియో ట్యాగింగ్ ప్రక్రియకు గత వారం శ్రీకారం చుట్టింది. గ్రామ/ వార్డు సచివాలయాల సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రతి ఇంటిని మ్యాపింగ్ చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రతి ఇంటిలో కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి క్లస్టర్ల వారీగా ప్రభుత్వ యాప్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేసి, జియో ట్యాగ్ చేస్తున్నారు. కుటుంబ సభ్యుల్లో ఒకరి ఫొటోను తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. నిరక్షరాస్యులైతే వేలిముద్ర, ముఖ ఆధారిత ఫొటో తీసుకుంటున్నారు. ఒక్కో ఉద్యోగి పట్టణ ప్రాంతాల్లో అయితే కనీసం 150 ఇళ్లను, గ్రామీణ ప్రాంతాల్లో అయితే 70-80 ఇళ్లను మ్యాపింగ్ చేసేలా పని విభజన చేశారు. జియో ట్యాగింగ్ సర్వే పర్యవేక్షణ బాధ్యతలను మండలాల్లో అయితే ఎంపీడీఓలను, పట్టణాల్లో అయితే మునిసిపల్ అధికారులకు అప్పగించారు.

అనకాపల్లి జిల్లాలో మొత్తం 5,80,202 కుటుంబాలు వున్నాయి. జిల్లా అధికారుల గణాకాల ప్రకారం ఇప్పటి వరకు 3,02,913 (52 శాతం) కుటుంబాలకు సంబంధించి సర్వే పూర్తయ్యింది. మిగిలిన ఇళ్ల సర్వే కొనసాగుతున్నది. జియో ట్యాగింగ్ ప్రక్రియను ఈ నెల 24వ తేదీనాటికి పూర్తిచేయాలని ఎంపీడీవోను జిల్లా కలెక్టర్ ఆదేశించారని గ్రామ/ వార్డు సచివాలయాల సిబ్బంది సమన్వయాధికారి మంజులావాణి తెలిపారు.

కలెక్టరేట్ వద్ద ఆశ వర్కర్ల ధర్నా

- సమస్యలు పరిష్కరించాలని నినాదాలు

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రాట్యుటీ అమలు చేయాలని, ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేస్తూ ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధ) ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. పాడైన సెల్‌ఫోన్ల స్థానంలో 5జీ సెల్‌ఫోన్లు ఇవ్వాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని,పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, ఏఎన్ఎంల నియామకంలో ఆశాలకు వెయిటేజీ మార్కులు ... మిగతా 8వ పేజీలో



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

పంచదార్ల క్షేత్రానికి భక్తుల తాకిడి





ఉమా ధర్మలింగేశ్వర స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు. (ఇన్‌సెట్‌లో) స్వామికి పాలాభిషేకం చేస్తున్న అర్చకుడు

- కార్తీక మాసం మూడో సోమవారం కావడంతో ఆలయంలో రద్దీ
- ఉమాధర్మలింగేశ్వర స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

రాంబిల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాస మహోత్సవాల్లో భాగంగా మూడో సోమవారం మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం పంచదార్ల భక్తుల శివ నామ స్మరణతో హోరెత్తింది. పంచదార్ల ఆలయానికి భక్తుల రాక వేకువజామునే మొదలైంది. రాధామాధవస్వామి ఆలయ గర్భంలో ప్రవహిస్తున్న ఐదు ధారల వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, అనంతరం పణిగిరిపై వున్న ఉమాధర్మలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయ ప్రాంగణం చుట్టూ బారులు తీరారు. అంతకుముందు తెల్లవారుజామున ధర్మలింగేశ్వరస్వామివారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారి తీర్థ, ప్రసాదాలను భక్తులకు అందజేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవదాయ శాఖ అధికారులు తగు చర్యలు చేపట్టారు.

నర్సీపట్నంలో యువకుడి హత్య

- కొత్తవీధిలో అర్ధరాత్రి ఘటన
- మద్యం మత్తులో రెండు వర్గాల మధ్య గొడవ
- ఒక వ్యక్తిని కర్రతో బలంగా కొట్టిన రౌడీ షీటర్ సంతోష్
- తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి
- నిందితులు పరారీ.. గాలించి పట్టుకున్న పోలీసులు
- పోలీసు స్టేషన్ ఎదుట హతుడి బంధువులు ఆందోళన



హతుడు నాగేశ్వరరావు (ఫైల్ ఫొటో)

నర్సీపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం మునిసిపాలిటీలోని కొత్తవీధిలో ఒక యువకుడు హత్యకు గురయ్యాడు. మద్యం మత్తులో స్థానిక యువకుల మధ్య జరిగిన గొడవ ఒకరి ప్రాణాలను బలిగొన్నది. ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను డీఎస్పీ మోహన్, పట్టణ సీఐ గోవిందరావు ... మిగతా 8వ పేజీలో



పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళనకారులు

ఇసుకకు నిరీక్షణ

- సబ్బవరంలో ఆగిన ఇళ్ల నిర్మాణాలు
- స్థానికంగా నదులు లేకపోవడం, ప్రభుత్వపరంగా సరఫరా కాకపోవడంతో సమస్య
- ఒడిశా నుంచి ఇసుక రప్పిస్తున్న దళారులు
- టన్ను రూ.1,500కు విక్రయం
- అంత ధరకు కొనలేక భవన నిర్మాణ పనులు తాత్కాలికంగా నిలుపుదల
- పనులు లేక ఇబ్బంది పడుతున్న భవన నిర్మాణ కార్మికులు



ఒడిశా నుంచి తెచ్చిన ఇసుకను డంప్ చేస్తున్న దృశ్యం



ఇసుక అందుబాటులో లేకపోవడంతో ఆగిన ఇంటి నిర్మాణం

సబ్బవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో భవన నిర్మాణాలకు ఇసుక అందుబాటులో లేకుండా పోయింది. మండల పరిధిలో నదులు లేకపోవడం, ప్రభుత్వ ఇసుక సరఫరా ఇంకా మొదలు కాకపోవడంతో ఇసుక కొరత ఏర్పడింది. ఇదే అదనుగా భావించి కొంతమంది దళారులు ఒడిశా నుంచి ఇసుకను రప్పించి అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. ఎక్కువ రేటుకు ఇసుక కొనుగోలు చేయలేక పలువురు భవన నిర్మాణ పనులను తాత్కాలికంగా నిలుపుదల చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని అమల్లోకి తీసుకొచ్చినప్పటికీ సబ్బవరం మండలంలో మాత్రం ఇసుక లభించని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఈ మండలంలో ఎక్కడా నదులు లేవు. ఇసుక విక్రయాలకు ప్రభుత్వం ఇంకా ఏర్పాటు చేయలేదు. ఫలితంగా చాలా వరకు భవన నిర్మాణాలు ఆగిపోయాయి. వైసీపీ హయాంలో అనకాపల్లి మండలం కోడూరు, చోడవరం మండలం అడ్డూరు సమీపంలో ఏర్పాటు చేసిన ఇసుక డిపోలు రెండేళ్లకే మూసివేయడంతో దళారులు రాజమహేంద్రవరం, శ్రీకాకుళంతోపాటు ఒడిశా నుంచి ఇసుకను తీసుకొచ్చి టన్ను ఇసుక రూ.1,200కు విక్రయించేవారు. వైసీపీ ప్రభుత్వం విక్రయించిన ధరకే దళారులు కూడా ఇసుక విక్రయిస్తుండడంతో భవన నిర్మాణాలకు ఇబ్బంది కలగలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెండు నెలలు వరకు ఇదే విధంగా ఇసుక అమ్మకాలు జరిగాయి. తరువాత ప్రభుత్వం నూతన ఇసుక విధానాన్ని అమల్లోకి తీసుకురావడం, నదుల్లో వరద పెరగడంతో ఇసుక సరఫరా నిలిచిపోయింది. కొద్ది రోజులకే దళారులు మళ్లీ రంగంలోకి దిగి ఒడిశా నుంచి భారీ వాహనాల్లో ఇసుక తీసుకొచ్చి, ఇక్కడ అధిక ధరకు విక్రయించడం మొదలు పెట్టారు. గతంలో టన్ను రూ.1,200కు లభించగా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో రూ.1,800 నుంచి రూ.2 వేల వరకు విక్రయించారు. తరువాత చోడవరం, మాడుగుల నియోజకవర్గాలోని నదుల్లో ఇసుక అందుబాటులోకి రావడంతో క్రమంగా రేటు తగ్గించుకుంటూ ఇప్పుడు రూ.1,500కు అమ్ముతున్నారు. అయినప్పటికీ ధర అధికంగా వుండడంతో పలువురు భవన నిర్మాణ పనులను తాత్కాలికంగా నిలిపివేశారు. ఫలితంగా భవన నిర్మాణ కార్మికులు పనులు లేక ఇబ్బంది పడుతున్నారు. గతంలో మాదిరిగా ప్రభుత్వం డిపోలు ఏర్పాటు చేసి ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని భవన నిర్మాణ యజమానులు, కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు.


సత్యవరం రోడ్డులో ఆవగెడ్డ వద్ద రక్షణ గోడ లేని బ్రిడ్జి


శిథిలావస్థకు చేరిన ఆవపై వంతెన


అరట్లకోట గ్రామం వద్ద ప్రమాదకర స్థితిలో ఉన్న కల్వర్టు

రక్షణ లేని కల్వర్టులతో భయం..భయం

- ఏమరుపాటుగా ఉంటే కాలువలోకే..
- వంతెనలకు మరమ్మతులు నిల్
- పట్టించుకోని అధికారులు

పాయకరావుపేట రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట నుంచి అరట్లకోట, గోపాలపట్నం, మంగవరం, పెంటకోట, సత్యవరం తదితర గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారుల్లోని కాలువలపై నిర్మించిన వంతెనలకు రక్షణ గోడలు లేక వాహన చోదకులు భయం భయంగా ప్రయాణాలు సాగిస్తున్నారు. పాయకరావుపేట నుంచి పెంటకోట వెళ్లే ప్రధాన రహదారిలో అరట్లకోట వద్ద గుంటపల్లి కాలువపై, పెద్దిపాలెం సమీపంలో ఆవపై ఉన్న బ్రిడ్జిలు శిథిలావస్థకు చేరాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ వంతెనలు ఇరుకుగా ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో అరట్లకోట, మంగవరం, గోపాలపట్నం, పెంటకోట, సత్యవరం, మాసాహెబ్‌పేట తదితర గ్రామస్థులు, నక్కపల్లి మండలంలోని గునుపూడి, బంగారమ్మపేట గ్రామస్థులు, పాఠశాలల బస్సులు, ఆటోలు, నిత్యం ప్రయాణిస్తుంటాయి. అరట్లకోట, గుంటపల్లి వద్ద బ్రిడ్జి ఇరుకుగా ఉండడంతోపాటు ఇరువైపులా రక్షణ గోడలు లేక ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని గ్రామస్థులు, వాహన చోదకులు భయపడుతున్నారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా వాహనంతోపాటు కాలువలోకి దూసుకుపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే అనేక మంది వాహనాలతో కాలువలోకి దూసుకుపోయాయి. కొన్నిసార్లు ట్రాక్టర్లు కాలువలోకి బోల్తాపడి మృత్యువాత పడిన సంఘటనలున్నాయి. ఈ రహదారిపై రద్దీకి అనుగుణంగా బ్రిడ్జిని వెడల్పు చేయాలని, రక్షణ గోడలు నిర్మించాలని కోరుతున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోలేదని గ్రామానికి చెందిన గర్లంక జమీలు, రాజు, వెంకటేశ్వరరావు, తదితరులు ఆరోపిస్తున్నారు. మంగవరం సమీపంలో ఆవపై ఉన్న బ్రిడ్జి శిథిలస్థితికి చేరుకుంది. భారీ వాహనాలు ప్రయాణం చేస్తే కూలుతుందేమోనన్న స్థితిలో ఉంది. సత్యవరం నుంచి గోపాలపట్నం వెళ్లే రోడ్డులో ఆవగెడ్డపై నిర్మించిన బ్రిడ్జికి రక్షణ గోడలు లేవు. ఇక్కడ ఉన్న మలుపులో అజాగ్రత్తగా ఉన్నా గెడ్డలో పడిపోయే ప్రమాదం ఉంది. కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంపై ప్రయాణికులు మండిపడుతున్నారు.

రక్షణ గోడలు నిర్మించాలి : సీహెచ్ చలపతి



అరట్లకోట వద్ద గుంటపల్లి కాలువ, గోపాలపట్నం సమీపంలో ఆవగెడ్డపైన బ్రిడ్జిలకు రక్షణ గోడలు లేక తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రాత్రి వేళలో భయంగా ఉంటుంది. ఏ మాత్రం ఆదమరిచినా కాలువలో పడిపోయే ప్రమాదం ఉంది. కొంతమంది ఇందులో పడి మృత్యువాత పడ్డారు. వెంటనే రక్షణ గోడలు నిర్మించాలి.

వీధి వ్యాపారులు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- మెప్మా పీవో సరోజిని


సమావేశంలో మాట్లాడుతున్న పీడీ సరోజిని

ఎలమంచిలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే ప్రోత్సాహంతో వీధి వ్యాపారులు మరింత ఆర్థికాభివృద్ధిని సాధించాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టరు సరోజిని అన్నారు. సోమవారం ధర్మవరంలోని మెప్మా కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వీధి వ్యాపారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వీధి వ్యాపారులు స్వానిధి పొందాలంటే వారు 8 స్కీమ్‌లలో నమోదు కావాలన్నారు. వాటి ద్వారా వారి వ్యాపారాలకు, కుటుంబాలకు సెక్యూరిటీ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా డిజిటల్ చెల్లింపులు ద్వారా వారికి వడ్డీ రాయితీ లభిస్తుందన్నారు. అనంతరం పట్టణంలోని వివిధ బ్యాంకుల అధికారులు పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సీఎంఎం పద్మావతి, ఐబీ వరలక్ష్మి, సీఓలు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికల్లో కూటమిని గెలిపించాలి


సమావేశంలో మాట్లాడుతున్న తోట నగేష్

పాయకరావుపేట రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సాగునీటి ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, జనసేన నాయకుడు తోట నగేష్ కోరారు. మండలంలోని మాసాహెబ్‌పేటలో సోమవారం ఆవ కాలువ మాసాహెబ్ చానల్ పరిధిలోని నాయకులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి అభ్యర్థులను గెలిపిస్తే కాలువలను అభివృద్ధి చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కంకిపాటి వెంకటేశ్వరరావు, చిక్కాల శ్రీనివాసరావు, గణపర్తి రాజుబాబు, కాశీవిశ్వనాథ్, వేముల వెంకటేశ్వరరావు, శ్రీరంగం రమేష్, జగ్గన్నదొర, కట్టాదొర పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు


హరిపాలెంలో సారె ఊరేగిస్తున్న భక్తులు

అచ్యుతాపురం రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపాలెంలో గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు సోమవారం ఘనంగా నిర్వహించారు. హరిపాలెం మదుము వంతెన వద్ద ప్రారంభమైన ఊరేగింపు మెయిన్ రోడ్డు మీదుగా సాగింది. గౌరమ్మ అనుపు ఉత్సవాలను బుధవారం నిర్వహించనున్నట్టు కమిటీ పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మారిశెట్టి లక్ష్మీకాంతం, ఉపసర్పంచ్ సీతారామ్, ఉత్సవ కమిటీ పెద్దలు మారిశెట్టి సూర్యనారాయణ, కాండ్రేగుల అప్పారావు, మత్సుర్తి శ్రీను, శరగడం ప్రసాద్, పెంటకోట అప్పారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్ ఏర్పాటు


ప్రకృతి ఉత్పత్తులను పరిశీలిస్తున్న తహసీల్దారు వరహాలు

ఎలమంచిలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ఏర్పాటు చేసి, వాటి గురించి అవగాహన కల్పించారు. ఈ స్టాల్‌ను తహసీల్దారు వరహాలు పరిశీలించారు. ఎటువంటి రసాయనాలు లేకుండా సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న కూరగాయల గురించి వివరించారు. కార్యక్రమంలో సీఎంఎఫ్ సిబ్బంది, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఇంటి పన్నుల వసూలుపై ప్రత్యేక దృష్టి : ఎంపీడీఓ

పాయకరావుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఇంటి పన్నులను శత శాతం వసూలు చేయాలని ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో సంపద తయారీ కేంద్రాల నిర్వహణ, ప్రతిరోజూ ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించే పనులు, తాగునీటి వనరుల నిర్వహణ చేపట్టాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్, ఏఓ సీహెచ్.రవికుమార్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

మునగపాకలో ఉపాధి పనుల తనిఖీ పూర్తి

మునగపాక, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మునగపాకలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులపై తనిఖీ ప్రక్రియ పూర్తయ్యిందని సర్పంచ్ దిమ్మల అప్పారావు అన్నారు. గ్రామ పంచాయతీ ఆవరణలో సోమవారం ఉపాధి హామీ పథకం గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పథకం పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశరాం, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఈసీ సంధ్య, మనోజ, దొడ్డి గోవింద, మేట్లు, ఉపాధి కార్మికులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ విజేత ఏటికొప్పాక

ఎలమంచిలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏటికొప్పాక గ్రామంలో బండిమాంబ అమ్మవారి జాతరను పురస్కరించుకుని నిర్వహించిన జిల్లా స్థాయి టోర్నమెంట్ విజేతగా ఏటికొప్పాక నూకాంబికా యూత్ జట్టు నిలిచింది. ఈకేపీ లోకల్ లెజెండ్స్, బండిమాంబ ఆలయ కమిటీ పర్యవేక్షణలో ఈనెల 11 వ తేదీ నుంచి నిర్వహించిన ఈ టోర్నీలో జిల్లా నలుమూలలు నుంచి 28 జట్లు పాల్గొన్నాయి. సోమవారం జరిగిన ఫైనల్‌లో ఏటికొప్పాక నూకాంబికా యూత్, ఏటికొప్పాక సీనియర్స్ జట్ల మధ్య జరిగిన పోటీలో నూకాంబికా యూత్ విజేతగా నిలిచింది.

నేత్రపర్వంగా శూలాల సంబరం


శూలాల సంబరానికి వచ్చిన భక్తులు


పార్వతి, సాంబమూర్తిలను దర్శించుకున్న ప్రముఖులు

- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు


శూలాలు ధరించిన భక్తుడు

మునగపాక, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాగులాపల్లిలో పార్వతి, సాంబమూర్తిల శూలాలు సంబరం నేత్రపర్వంగా జరిగింది. సాయంత్రం 6 గంటల నుంచి పెద్ద ఎత్తున మొక్కు శూలాలు మొదలయ్యాయి. వయస్సుతో సంబంధం లేకుండా అన్ని వయస్సుల వారు శూలధారణతో మొక్కులు చెల్లించారు. 1001, 516, 116 ఇనుప చువ్వలు కలిగిన సుబ్రహ్మణ్యం, శివ శూలాలను వీర శైవులు ధరించారు. గ్రామంలో ప్రధాన వీధుల్లో ఏర్పాటు చేసిన స్టేజీలపై సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. సంబరాన్ని తిలకించడానికి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రముఖుల సందర్శన

నాగులాపల్లి శూలాల పండుగ సందర్భంగా స్వామివారిని ఏపీఆర్‌డీసీ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, ఉత్తరాంధ్ర జిల్లాల జనసేన పార్టీ అధికార ప్రతినిధి సుందరపు సతీష్‌కుమార్, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, డైరెక్టర్ బీమరశెట్టి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. కూటమి, వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, స్వామివారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. వారికి ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు.

శంభో.. శివ శంభో..


ఎలమంచిలి త్రిమూర్తులుస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నక్కపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీక మూడో సోమవారం మండలంలోని ఉపమాక, గొడిచెర్ల శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తులు ముక్కంటిని దర్శించుకున్నారు. మహిళలు ధ్వజస్తంభం, ఉసిరి, జమ్మి వృక్షాల వద్ద పుణ్యదీపాలు వెలిగించారు. ఉపమాక వేంకటేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి నేతృత్వంలో ఏర్పాట్లు చేపట్టారు. మధ్యాహ్నం అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు.

పాయకరావుపేట రూరల్‌లో..

మండలంలోని సత్యవరం, రాజగోపాలపురం, గోపాలపట్నం సీతమ్మవారి కొండ, పెద్దిపాలెం, పెంటకోట, నామవరం గ్రామాలలోని శివాలయాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని అభిషేకాలు, పూజలు నిర్వహించారు. శివాలయాలు శివ నామ స్మరణతో మార్మోగాయి. సీతమ్మవారి కొండపై ఉమాధర్మలింగేశ్వర స్వామిని పాయకరావుపేట, తుని, నక్కపల్లి మండలాల భక్తులు భారీగా దర్శించుకున్నారు. భక్తులకు మంగవరం గ్రామస్థులు అన్నసమారాధన నిర్వహించారు. అదేవిధంగా పెద్దిపాలెం, రాజగోపాలపురం శివాలయాల వద్ద భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

ఎలమంచిలిలో..

కార్తీక మూడో సోమవారం పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి కొత్తపేట రామలింగేశ్వర స్వామి ఆలయం, త్రిమూర్తులు స్వామి, బైపాస్ రోడ్డులోని సోమస్కంధ స్వామి ఆలయం, శేషుగెడ్డ వద్ద శివాలయములు భక్తులతో రద్దీగా మారాయి. మునిసిపాలిటీలోని సోమలింగపాలెం, కొక్కిరాపల్లి, పెదపల్లి, యర్రవరం గ్రామాల్లోని ఆలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మండలంలోని ఏటికొప్పాక, పులపర్తి, వీఎస్‌ఆర్‌పేట, లక్కవరం గ్రామాల్లోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు.

ఎస్.రాయవరంలో..

మండలంలోని పలు గ్రామాల్లోని శివాలయాల్లో కార్తీక సోమవరం పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గెడ్డపాలెం, పెనుగొల్లు, పెదగుమ్ములూరు, సర్వసిద్ధి, దార్లపూడి తదితర గ్రామాల్లో శివాలయాలకు భకులు పోటెత్తారు.


నక్కపల్లి: ఉపమాకలో భక్తులతో నిండిపోయిన క్యూ లైన్లు

గ్రంథాలయాల్లో వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు


అచ్యుతాపురంలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నక్కపల్లి, నవంబరు 18 .(ఆంధ్రజ్యోతి): మండలంలోని చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి కె.జనార్దన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పలువురు బాలికలు ఉత్సాహంగా పాల్గొని పలు చిత్రాలు గీశారు. పర్యావరణం- పరిరక్షణ, మనం.. మన గ్రంథాలయం, జాతి నాయకుల గురించి చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్టు గ్రంథాలయాధికారి కె.జనార్దన్ చెప్పారు.

అచ్యుతాపురంలో..

స్థానిక గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు ప్రసాద్, పల్లి శివకృష్ణ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించినట్టు గ్రంథాలయాధికారి దొడ్డి కోటేశ్వరరావు తెలిపారు.

ఎలమంచిలిలో..

ఎలమంచిలిలో సోమవారం మునిసిపాలిటీలోని పలు పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించినట్టు గ్రంథాలయాధికారి ఆనంద్ తెలిపారు. గ్రంథాలయాల ప్రాధాన్యతపై పోటీలను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వనుం నాగేశ్వరరావు, వైవీ.రమణ, పిట్టా వరలక్ష్మి, బి.అమరావతి, సీహెచ్. చంద్రశేఖర్, కె. మాయాదేవి పాల్గొన్నారు.

కోటవురట్లలో..

స్థానిక హైస్కూళ్ల 6,7,8 తరగతుల విద్యార్థులకు సోమవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రభుత్వహైస్కూల్, బాలికల ఉన్నత పాఠశాల, కస్తూర్బా విద్యాలయానికి చెందిన పదేసి మంది విద్యార్థులు గ్రూపులుగా ఏర్పాటు చేసి క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీలను గ్రంథాలయాధికారి అప్పలనాయుడు, టీచర్ సామాల కిషోర్‌బాబు, తదితరులు జరిపారు.

పాయకరావుపేటలో..

స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం నిర్వహించిన యోగా పోటీలు అలరించాయి. విద్యార్థులు క్లిష్టమైన పలు ఆసనాలు వేసి ఆకట్టుకున్నారు. అంతకుముందు నిర్వహించిన భగవద్గీత శ్లోకాల పోటీల్లో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కబరిచారు. కార్యక్రమంలో ఎన్‌టీ.సీతారామమూర్తి, ఇన్‌చార్జి లైబ్రేరియన్ లక్ష్మణరావు, యోగా గురువు వరప్రసాద్ పాల్గొన్నారు.

మునగపాకలో..

మండలంలో మునగపాక, గణపర్తి గ్రంథాలయాల్లో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం మునగపాక గ్రంథాలయంలో క్విజ్, వ్యాసరచన, డిబేట్ పోటీలను నిర్వహించినట్టు గ్రంథాలయాధికారి ఎల్‌వీ.రమణ తెలిపారు.గణపర్తిలో చిత్రలేఖనం పోటీలు ఏర్పాటు చేసినట్టు అప్పలనర్స చెప్పారు.

పాఠశాలల్లో చేతిబోర్లు ప్రారంభం


బోరును ప్రారంభిస్తున్న సంస్థ డైరెక్టర్ రాజా కులపతి, వైజర్

నక్కపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినదొడ్డిగల్లు జడ్పీ హైస్కూల్‌లో 350 మంది విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన బోరును అమెరికాకు చెందిన వెల్స్ ఫర్ లైఫ్ డైరెక్టర్ వైజర్, ఎలమంచిలికి చెందిన న్యూ లైఫ్ సంస్థ డైరెక్టర్ రాజా కులపతి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, తోట సత్తిబాబు, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీను, హెచ్‌ఎం బి. కవితి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో..

మండలంలోని తిమ్మాపురం కేజీబీవీ పాఠశాలలో నాసా సంస్థ ఏర్పాటు చేసిన చేతిబోరును సోమవారం అమెరికాకు చెందిన వైజర్ ప్రారంభించారు. పాఠశాలకు విచ్చేసిన అమెరికాకు చెందిన వైజర్, నాసా సంస్థ ప్రతినిధులకు బాలికలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రి సత్యనారాయణ, ఇన్‌చార్జి ఎంఈవో సత్తిబాబు, టీచర్లు పాల్గొన్నారు.

ఎలమంచిలి సీహెచ్‌సీ దుస్థితిని అసెంబ్లీలో లేవనెత్తిన సుందరపు


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు

ఎలమంచిలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) దుస్థితిని సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ లేవనెత్తారు. వాస్తవానికి 30 పడకల ఆస్పత్రిని 50 పడకల ఆస్పత్రిగా మార్చు చేశారని, 2019-24 మధ్యలో రూ.8.2 కోట్లు మంజూరు చేసి 36 వేల స్కేర్ ఫీట్‌లో నిర్మించాల్సి ఉండగా.. 8 వేల స్కేర్ ఫీట్‌లో నిర్మించారన్నారు. వాస్తవానికి ఈ రోజు 11 బెడ్‌ల ఆస్పత్రిగా మార్చారన్నారు. ప్రధాన రోడ్డు పక్కన ఉండాల్సిన సీహెచ్‌సీని మారుమూల ప్రాంతంలో నిర్మించడంతో రోగులు వెళ్లేందుకు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారన్నారు. అంతేకాకుడా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, డీసీహెచ్‌ఓ పోస్టులు ఇన్‌చార్జిలే పర్యవేక్షించాల్సి వస్తుందన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అర్జునరావు


ఆందోళన నిర్వహిస్తున్న సీపీఐ, కార్మిక సంఘం సభ్యులు

పాయకరావుపేట రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలోని పేదలకు మూడు సెంట్లు, పట్టణంలోని పేదలకు రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని అనకాపల్లి జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు వెలుగుల అర్జునరావు అన్నారు. సోమవారం మండలంలోని కుమారపురం గ్రామ సచివాలయం వద్ద సీపీఐ, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. అనంతరం ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ వ్యక్తిగతంగా అర్జీలను సమర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు బందుల సుబ్బలక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యురాలు ఎపల్లి రమణమ్మ, చొక్కా వీరబాయి, చినబాబు, అప్పారావురెడ్డి, వరలక్ష్మి పాల్గొన్నారు.

కొత్తపాలెంలో 24 గంటలు ఏకాహం

ఎలమంచిలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి):మునిసిపాలిటీ కొత్తపాలెం గౌరీపరమేశ్వరుల ఆలయ ఆవరణలో సోమవారం ఉదయం 6 గంటల నుంచి మంగళవారం ఉదయం వరకు భక్తి భజన కీర్తనలతో శివనామస్మరణ చేస్తూ ఏకాహం కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామస్థులందరి సమక్షంలో 24 గంటలుపాటు శివనామస్మరణతో చేపట్టిన ఏకాహం కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.


నేటి నుంచి మొబైల్ ఆధార్ క్యాంపులు

నక్కపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈనెల 19 నుంచి నక్కపల్లి మండలంలో మొబైల్ ఆధార్ క్యాంపులు ప్రారంభమవుతాయని ఎంపీడీవో డి. సీతారామరాజు సోమవారం చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నవంబరు నెల 3, 4 వారాల్లో రెండు దశల్లో ఈ క్యాంపులు నిర్వహిస్తామని చెప్పారు. మొదటి దశలో ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు , రెండో దశలో 26 నుంచి 29వ తేదీ వరకూ నిర్దేశించిన పంచాయతీల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. మండలంలోని 22 సచివాలయాల్లో కూడా ఈ రెండు దశల్లోనూ మొబైల్ ఆధార్ క్యాంపులు వుంటాయని, ఏ రోజున ఏ సచివాలయాల్లో జరుగుతాయో , సచివాలయ సిబ్బంది సమాచారం ఇస్తారని చెప్పారు. గ్రామ సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల ప్రాంగణంలో ఈ శిబిరాలు ఏర్పాటవుతాయన్నారు. ఆధార్ నమోదు, ఆధార్ సవరణ, ఇతర సేవలు పొందవచ్చునని చెప్పారు.ఈ మేరకు పంచాయతీ కార్యదర్శులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని ఎంపీడీవో సీతారామరాజు చెప్పారు.

కొండకర్లలో ధర్మరక్షా దినోత్సవం

అచ్యుతాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండకర్లలో ధర్మరక్షా దినోత్సవాన్ని సోమవారం సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ డివిజన్ కన్వీనర్ బీవీ రమణ మాట్లాడుతూ కొందరు మహానుభావులు. ధర్మం కోసం సర్వం ధారపోశారన్నారు. వీరిలో లక్ష్మణానంద సరస్వతి ఒకరన్నారు. ఈయన తన 25వ ఏటే తన భార్య, ఇద్దరు పిల్లలను వదిలి ఆధ్యాత్మిక సాధన కోసం హిమాలయాలకు వెళ్లారన్నారు. పుష్కర కాలం తపస్సు చేసి ధర్మరక్షణ కోసం పాటుపడుతున్న ఆయన్ని ఎదుర్కొలేక 15 మంది మత ఉగ్రవాదులు హతమార్చారన్నారు. ఇలా ధర్మం కోసం చాలా మంది అసువులు బాశారన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణానంద సరస్వతి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో కొల్లి అప్పారావు, గుడివాడ రమణ, ఆడారి త్రినాథ్, కట్టుమూరి శ్రీనివాసరావు, శరగడం పరశురామ్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన ఎంఈవో


మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న ఎంఈవో నూకరాజు

నక్కపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి కేజీబీవీని సోమవారం మధ్యాహ్నం ఎంఈవో-2 వేమగిరి నూకరాజు తనిఖీ చేశారు. పాఠశాలలో టెన్త్ బాలికల విద్యా ప్రగతిని గుర్తించేందుకు నిర్వహిస్తున్న పరీక్షలను ఆయన పరిశీలించారు. ప్రతీ బాలిక విద్యా ప్రగతి, సామర్థ్యం ఎలా వుందో తెలుసుకోవడానికి ఈ పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయని ఆయన చెప్పారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో సలీమా పాల్గొన్నారు.

శ్రీచైతన్య టెక్నో విద్యార్థుల సేఫ్ ఇండియా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు

పాయకరావుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీచైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు సోమవారం సేఫ్ ఇండియా పేరిట పట్టణంలో ర్యాలీ నిర్వహించి, ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వై.జంక్షన్ వద్ద విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పలువురు ట్రాఫిక్ పోలీసులతోపాటు స్కూల్ ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఎంవీ.సురేష్, ఆర్ఐ గోపీనాథ్, ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు, వైస్ ప్రిన్సిపాల్ రమణ, డీన్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లుగా పునాదులకే పరిమితం!



సామాజిక భవనానికి చెందిన శిలాఫలకం

ఈ.బోనంగిలో నిలిచిపోయిన కాపు సామాజిక భవన నిర్మాణం

- 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు
- అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ నిర్లక్ష్యం
- చుట్టూ దట్టంగా పెరిగిన ముళ్ల పొదలతో నేడు దర్శనం



పునాదుల చుట్టూ దట్టంగా పెరిగిన ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు

పరవాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈ.బోనంగి ఫార్మా పునరావాస కాలనీలో కాపు సామాజిక భవన నిర్మాణం పునాదుల్లోనే నిలిచిపోయింది. ఇక్కడి కాపు సామాజికవర్గానికి చెందిన ప్రజల అవసరాల నిమిత్తం గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ భవన నిర్మాణానికి రూ. 50లక్షలు మంజూరు చేశారు. 2019వ సంవత్సరం ఫిబ్రవరి 4న అప్పటి కార్మికశాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, అప్పటి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి తదితరులు ఫార్మా పునరావాస కాలనీ ఉద్యానవనం వెనుక వైపున ఉన్న విశాలమైన ప్రాంగణంలో దీని నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ వెంటనే నిర్మాణ పనులను ప్రారంభించి పిల్లర్లు, బేస్‌మెంట్ పూర్తి చేశారు.

నిర్మాణ పనులపై వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం

2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. నాటి నుంచి ఈ భవన నిర్మాణ పనులపై నిర్లక్ష్యం వహించింది. అధికారంలో ఉన్న ఐదేళ్లలో భవన నిర్మాణ పనులు చేపట్టాలన్న ఆలోచన వైసీపీ ప్రభుత్వానికి లేకపోయింది. జగన్ తీరు పట్ల కాపు సామాజికవర్గానికి చెందిన పలువురు అప్పట్లోనే పెదవి విరిచారు. అయినప్పటికీ పనులు పునాదుల స్థాయిలోనే నిలిచిపోయాయి. ప్రస్తుతం పునాది చుట్టూ ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. పిల్లర్లు తుప్పు పట్టిపోయాయి. దట్టమైన పొదల కారణంగా విషపురుగులు సంచారం ఎక్కువైందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రెండు, మూడు దఫాలు ముళ్ల పొదలను తొలగించినా మళ్లీ యధావిధిగా పెరిగిపోయాయని అక్కడివారు వాపోతున్నారు.

శుభకార్యాల నిర్వహణకు ఇబ్బందులు

కాపు సామాజికవర్గానికి చెందిన పేదలు శుభకార్యాలు జరుపుకోవడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రైవేటు మండపాలను బుక్ చేసుకునే స్థోమతలేని వారంతా ఇబ్బందుల నడుమే శుభకార్యాలు చేసుకోవాల్సి వస్తుంది. సామాజిక భవనం అందుబాటులోకి వస్తే ఈ పరిస్థితి ఉండేది కాదు. ముఖ్యంగా మండలంలో కాపు సామాజికవర్గానికి చెందిన వారు ఈ. మర్రిపాలెం, కన్నూరు, మడకపాలెం, మంత్రిపాలెం, సాలాపువానిపాలెం, తాడి, కలపాక, స్వయంభూవరం, రావాడ, ధర్మారాయుడుపేట, పి.బోనంగి, మరిసవానిపాలెం, భరణికం, దేశపాత్రునిపాలెం, జాజులవానిపాలెం, బొద్దపువానిపాలెం, లంకెలపాలెం గ్రామాల్లో ఎక్కువగా ఉన్నారు. వీరు శుభకార్యాలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వమైనా స్పందించి ఈ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని వారంతా వేడుకుంటున్నారు. భవనం పూర్తయితే తమ అవస్థలు తీరుతాయని చెబుతున్నారు.

కూటమి ప్రభుత్వమైనా పనులు పూర్తి చేయాలి



కాపు సామాజిక భవన నిర్మాణానికి కూటమి ప్రభుత్వం సత్వరమే చర్యలు చేపట్టాలి. టీడీపీ హయాంలోనే భవన నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించి పునాదులు పూర్తయ్యాయి. ఇంతలో వైసీపీ అధికారంలోకి వచ్చింది. భవన నిర్మాణంపై ఆ పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. గడచిన ఐదేళ్లలో ఈ విషయాన్ని పట్టించుకునే నాథుడే లేకపోయారు. **- అట్టా సన్యాసిఅప్పారావు,** మండల తూర్పు కాపు సంఘం మాజీ అధ్యక్షుడు

త్వరలో పెరుగు బజార్ రహదారి విస్తరణ పనులు పూర్తి

- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీలకు సత్వర పరిష్కారం
- జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ రమణ



అర్జీని స్వీకరిస్తున్న జెడ్సీ రమణ

అనకాపల్లి టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ జోనల్ కార్యాలయానికి వచ్చే అర్జీలను వెను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని జోనల్ కమిషనర్ బీవీ రమణ తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా సోమవారం పలువురి నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో కుక్కల బెడద అధికంగా ఉందని వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని, రింగురోడ్డులో చెత్తకుప్పలను తొలగించాలని, లక్ష్మీనారాయణనగర్ సమీపంలో తాగునీటి కుళాయి పైపులైన్లు దెబ్బతిన్నాయని వాటిని మెరుగుపర్చాలని పలువురు విన్నవించినట్టు చెప్పారు. అసంపూర్తిగా ఉన్న పెరుగు బజార్ రహదారి విస్తరణ పనులు త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. పలువురు బాధితులకు టీడీఆర్‌లు ఇవ్వాల్సి ఉందని త్వరలోనే అవి అందుబాటులోకి రానున్నాయని వివరించారు. అలాగే రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియం పనులు వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించినట్టు చెప్పారు. సమస్యలపై అందిన ప్రతి అర్జీపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు పునరుద్ఘాటించారు.

అసంపూర్తిగా సాగునీటి సంఘం ఓటర్ల జాబితా

- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బోనివాని చెరువు ఆయకట్టు రైతులు

సబ్బవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇరువాడలో గల బోనివాని చెరువు సాగునీటి సంఘం ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితా అసంపూర్తిగా ఉందని పలువురు ఆయకట్టు రైతులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు అనకాపల్లిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయా రైతులు ఇక్కడి విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలోని బోనివాని చెరువు కింద సర్వే నెంబర్లు 183లో 4.71 ఎకరాలు, 186లో 11.76 ఎకరాలు, 38 సర్వే నెంబర్లలో ఉన్న రైతుల పేర్లు రెవెన్యూ ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన ఓటర్ల జాబితాలో లేవని వివరించారు. ఈ అంశం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. తక్షణమే ఆయా సర్వే నెంబర్లలో ఉన్న ఆయకట్టు రైతుల పేర్లు రికార్డుల్లో నమోదు చేసి, ఓటు హక్కు కల్పించాలని కలెక్టర్‌కు విన్నవించినట్టు చెప్పారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో బీసీ సెల్ అనకాపల్లి జిల్లా కార్యదర్శి రేసుపూడి రమణ తదితరులు ఉన్నారు.

కొత్తూరు కాలేజీ బ్రిడ్జిపై బీటీ రోడ్డుకు చర్యలు

కొత్తూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ కొత్తూరులో ఉన్న కాలేజీ బ్రిడ్జిపై బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో సదరు ప్రాంతాన్ని కూటమి నాయకులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడ సరైన రోడ్డు లేక వాహనదారులు ఎదుర్కొంటున్న సమస్యను ఎమ్మెల్యే కొణతాల దృష్టికి తీసుకు వెళ్లిన నేపథ్యంలో రూ.80లక్షలు మంజూరు చేశారన్నారు. ఆయనతో పాటు ఇందుకు తమవంతు కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే పీలా, జనసేన నాయకుడు రాంకీలకు కృతజ్ఞతలు తెలిపారు.

గౌరీ పరమేశ్వరుల వేడుకల్లో వాయినాలు పంపిణీ

అనకాపల్లి టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గౌరీ పరమేశ్వరుల మహోత్సవంలో భాగంగా గవరపాలెం వినాయక గౌరీ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ముత్తాయిదువులకు వాయినాలు అందజేశారు. ప్రముఖ వ్యాపారవేత్త మళ్ల జగ్గఅప్పారావు, మోహిని దంపతులు సహకారంతో వందలాది మందికి వీటిని అందించారు. ఆలయ శాశ్వత చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు, అధ్యక్షుడు భీమరశెట్టి శ్రీనివాసరావు, కార్యదర్శి బుద్ద బల్లమ్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్ స్టేషన్ ఎస్ఐగా రవికుమార్



రవికుమార్

కొత్తూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) :అనకాపల్లి రూరల్ పోలీసు స్టేషన్ ఎస్ఐగా జి.రవికుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన విశాఖ నగరంలోని వివిధ స్టేషన్లతో పాటు మునగపాక ఎస్ఐగా కూడా పనిచేశారు. తాజాగా సీఐడీ విభాగం నుంచి ఇక్కడికి బదిలీపై విచ్చేశారు. కాగా, ఇంతవరకు ఇన్‌చార్జి ఎస్‌గా ఉన్న సత్యనారాయణ అనకాపల్లి పట్టణ పోలీసు స్టేషన్‌కు తిరిగి వెళ్లారు.

21న 'సింహాద్రి'లో రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీలు



పాఠశాల స్థాయిలో వచ్చిన చిత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

పరవాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సింహాద్రి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో ఈ నెల 21న స్థానిక దీపాంజలి నగర్ టౌన్‌షిప్‌లో రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 'ఎనర్జీ కన్జర్వేషన్ టు ప్రొటెక్ట్ ద ఎన్విరాన్‌మెంట్' అంశంపై ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఐదు, ఆరు, ఏడు తరగతులకు చెందిన విద్యార్థులను-ఎ గ్రూపుగా, ఎనిమిది, తొమ్మిది, పది తరగతులకు చెందిన విద్యార్థులను-బి గ్రూపుగా విభజించారు. ఈ పోటీల్లో ఒక్కో గ్రూపు నుంచి ప్రతిభ కనబరిచే ముగ్గురు విజేతలను ఎంపిక చేసి వరుసగా రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు నగదు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు అందజేయనున్నారు. అలాగే ఒక్కో గ్రూప్ నుంచి పదేసి మందికి కన్సొలేషన్ బహుమతుల కింద ఒక్కొక్కరికి రూ.7,500 నగదు అందిస్తామని సంస్థ సీఎస్ఆర్ సీనియర్ మేనేజర్ కె.ప్రకాశరావు తెలిపారు. ఇప్పటికే ఎంతో మంది విద్యార్థులు పాఠశాల స్థాయిలో 850కి పైగా చిత్రాలు వేసి ఇటీవల సింహాద్రి ఎన్టీపీసీకి పంపారని వెల్లడించారు. వాటిలో ఆకట్టుకునే 110 చిత్రాలను ఏయూ ఫైన్ ఆర్ట్స్ విభాగానికి చెందిన నిపుణుల ద్వారా గుర్తించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. 21వ తేదీ గురువారం ఉదయం తొమ్మిది గంటలకు స్థానిక సంయుక్త హాల్‌లో పోటీలు ప్రారంభం కానున్నట్టు చెప్పారు. ఈ పోటీల్లో అద్భుత ప్రతిభ చూపిన గ్రూప్ నుంచి ముగ్గురు చొప్పున ఎంపిక చేసి ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

ఘనంగా మాజీ ఎంపీపీ 'వేగి' జన్మదిన వేడుకలు



వేగి గోపీకృష్ణకు కేక్ తినిపిస్తున్న జనసేన పార్టీ నాయకుడు రాంకీ

కశింకోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎంపీపీ వేగి గోపీకృష్ణ జన్మదిన వేడుకలను సోమవారం కశింకోటలో ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ ముఖ్య అతిథిగా హాజరై ఆయనతో కేక్ కట్‌చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల కోసం పని చేసే నాయకుడు గోపీగా పేర్కొన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు కాయల మురళీధర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కూటమి నాయకులు సిదిరెడ్డి శ్రీనివాసరావు, కాండ్రేగుల సతీష్‌కుమార్, నయనంశెట్టి రమణారావు, కలగ సోమేశ్వరరావు, మహిళా నేత పెదపాటి కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.





అనకాపల్లిలోని సిద్ధిలింగేశ్వర, కాశీవిశ్వేశ్వర ఆలయాల్లో అభిషేకాలు చేస్తున్న అర్చకులు



సబ్బవరం మండలందేవీపురం దక్షవటిలో...

త్రిశూలధారి.. త్రినేత్రధారి..

- కార్తీక సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలు కిటకిట
- స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలు



కాశీవిశ్వేశ్వర ఆలయంలో ధ్వజస్తంభం వద్ద దీపారాధన చేస్తున్న మహిళలు

అనకాపల్లి టౌన్/కొత్తూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కార్తీక సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువ జాము నుంచి విశేష పూజలు ఆరంభమయ్యాయి. అనకాపల్లి పట్టణంలోని కాశీవిశ్వేశ్వర, సిద్ధిలింగేశ్వర, ఉమా రామలింగేశ్వర, భోగలింగేశ్వర ఆలయాలతో పాటు కూరగాయల మార్కెట్ వద్ద శివాలయాల్లో శివునికి పంచామృతాభిషేకాలు జరిపారు. అలాగే వెంకుపాలెం శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. బట్లపూడిలో ఉన్న సోహం ఆశ్రమంలో సోమవారం సాయంత్రం మహా మృత్యుంజయహోమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆశ్రమ వ్యవస్థాపకుడు కాండ్రేగుల రవికుమార్, నళిని, కాండ్రేగుల శంకరరావు, పరదేశినాయుడు, తోట బాబ్జీ, సుందరపు గణేష్ పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని శివాలయాలు శివ నామస్మరణతో మార్మోగాయి. తాడి నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో కార్పొరేటర్ మాదంశెట్టి చిన తల్లి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరవాడ మల్లికార్జునస్వామి ఆలయంలో ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి శ్రీనివాస్ దంపతులతో పాటు జడ్పీటీసీ మాజీ సభ్యుడు పైలా జగన్నాథరావు, సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, జనసేన మండల ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాద్ తదితరులు పూజలు జరిపారు. భరణికం, లేమర్తి, దేశపాత్రునిపాలెం, స్వయంభూవరం, దీపాంజలినగర్ తదితర ప్రాంతాల్లోని శివాలయాల్లో విశేష పూజలు చేపట్టారు.

సబ్బవరం : మండలంలోని శైవక్షేత్రాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. పైడివాడలోని స్వయంభూ నందీశ్వరస్వామి ఆలయం, దేవీపురంలోని దక్షవటి, గణపతిపురంలోని మల్లికార్జునస్వామి, వంగలి,లింగాలతిరుగుడులోని సోమలింగేశ్వరస్వామి ఆలయాలు, ఇరువాడలోని భీమలింగేశ్వరస్వామి, గొర్లివానిపాలెంలోని ఉమా రామలింగేశ్వరస్వామి ,పెదయాతపాలెంలోని గౌరీపరమేశ్వర సహిత ద్వాదశ జ్యోతిర్లింగాలయం, మొగలిపురంలోని విఘ్నేశ్వరాలయం శివనామ స్మరణతో మార్మోగాయి. ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు.

నర్సింగబిల్లిలో పూర్వ విద్యార్థులు సందడి



పాఠశాలలో కలుసుకున్న 1997-98 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

కశింకోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నర్సింగబిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 1997-98 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్నవారంతా ఓ చోట కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేవు. ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకుని, నాటి మధుర స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ప్రధానోపాధ్యాయుడు గోపాలకృష్ణతో పాటు అప్పటి సైన్స్ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు, గణితం ఉపాధ్యాయుడు కాశి తదితరులను ఘనంగా సత్కరించారు. సహపంక్తి భోజనాల అనంతరం సాయంత్రం వరకు సరదాగా గడిపారు.

గ్రంథాలయాల్లో పోటీలకు విద్యార్థులు ఉత్సాహంగా హాజరు

అనకాపల్లి టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం జీవీఎంసీ పట్టణ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సిద్ధార్థ సోషల్ సర్వీసు అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రుధిర రాణి విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయాధికారి కె.శ్రీనివాసరావు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం వివిధ పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు ఉత్సహంగా తలపడ్డారు. గ్రంథాలయాధికారిణి వి.శిరీషా ఆధ్వర్యంలో 'బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన చట్టం' అంశంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఎంపీపీ స్కూల్ టీచర్ ఫాణి, ఉపాధ్యాయులు దివాకర్, కుమారి పాల్గొన్నారు.

పరవాడ : ఇక్కడి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు సోమవారంస్మార్ట్ ఫోన్ వలన లాభాలు, నష్టాలు అంశంపై డిబేట్ నిర్వహించారు. ఫోన్‌ను గంటల తరబడి చూస్తే మానసిక రుగ్మతలకు దారి తీస్తుందని ఉపాధ్యాయురాలు తులసీ హెచ్చరించారు. గ్రం థాలయ సిబ్బంది కేవీ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు

కశింకోట : మండల కేంద్రమైన కశింకోట శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, డీపీఎస్ స్కూల్ నుంచి వంద మంది విద్యార్థులు హాజరయ్యారు. తొలుత గ్రంథాలయాల ప్రాముఖ్యతను ఉపాధ్యాయుడు కాశీ వివరించారు. గ్రంథాలయాధికారిణి కె.వర లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ధర్నా



కశింకోట మండలం జమాదులపాలెం సచివాలయం వద్ద వినతి సమర్పణ



పరవాడ దేశపాత్రునిపాలెం సచివాలయం ఎదుట ఆందోళన

అనకాపల్లి టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఐ నాయకులు పట్టణంలోని ఆరు, ఏడు, ఎనిమిది సచివాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ అనకాపల్లి జోనల్ కార్యదర్శి వైఎన్ భద్రం మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. అనంతరం సచివాలయ అడ్మిన్ గంగాధర్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు కోరిబిల్లి శంకరరావు, శ్రీరామదాసు అబ్బులు, కరణం మాణిక్యాలరావు, మొల్లేటి గోపాల రమణ, కేవీ రమణ పాల్గొన్నారు.

కశింకోట : గ్రామీణ ప్రాంతంలో పేదలకు మూడు సెంట్లు స్థలం కేటాయించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. జమాదులపాలెంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.ఎస్.సన్యాసిరావు పర్యటించి మాట్లాడారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. నాయకులు ఒమ్మి సూరిబాబు, అన్నపూర్ణ, శివ, లక్ష్మి, అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం పేదలకు రెండు సెంట్లు చొప్పున ఇంటి స్థలం కేటాయించడంతో పాటు నిర్మాణ సబ్సిడీని రూ.ఐదు లక్షలకు పెంచాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం దేశపాత్రునిపాలెం సచివాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఆ పార్టీ జిల్లా సమితి సభ్యురాలు బూసి పరమేశ్వరి, ఎన్.అనూరాధ, కె.తులసీ, ఎన్.సరోజిని, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

గవరపాలెం భక్తాంజనేయ ఆలయంలో ఏకాహం



ఆలయంలో ఏకాహం నిర్వహిస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెం పరమేశ్వరీ పార్కు జంక్షన్‌లోని భక్తాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం ఏకాహం ప్రారంభమైంది. భక్తులు తెల్లవారుజాము ఆరు గంటల నుంచి మంగళవారం తెల్లవారుజాము ఆరు గంటల వరకు శ్రీ రామదూత జై -జై ఆంజనేయజై అనే నామస్మరణ చేస్తున్నారు. ఇదిలావుంటే, ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆయల నిర్వాహకులు పొలిమేర నాయుడు తెలిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశామన్నారు.

సత్యసాయి మందిరంలో ఉచిత వైద్య శిబిరం



ఆరోగ్య సూత్రాలను వివరిస్తున్న డాక్టర్ నారాయణరావు

అనకాపల్లి టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సత్యసాయి బాబా జయంత్యుత్సవంలో భాగంగా గవరపాలెం నిదానందొడ్డిలోని మందిరం ఆవరణలో సోమవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కేకేవీఏ నారాయణరావు మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు గైనిక్ వైద్యురాలు లక్ష్మి రోగులను పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మళ్ల సాయి తదితరులు పాల్గొన్నారు.

వైద్యాలయంలో క్షతగాత్రులకు పరామర్శ



వైద్యం పొందుతున్న వారిని పరామర్శిస్తున్న భరత్‌కుమార్

అనకాపల్లి టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి చినరాజుపేటలో ఇటీవల నిర్వహించిన జ్వాలా తోరణంలో తీవ్రంగా గాయపడి ఎన్టీఆర్ వైద్యాలయంలో చికిత్స పొందుతున్న వారిని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ సోమవారం పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్య సేవలందించాలని కోరారు. ఆ పార్టీ నాయకులు మందపాటి జానకి రామరాజు, కె.ఎం.నాయుడు, మలసాల కిశోర్, బొడ్డేడ శివ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధి భానుకు సత్కారం



భానుమూర్తి యాదవ్‌ను సత్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

కొత్తూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన బోయిన భానుమూర్తి యాదవ్‌ను కాంగ్రెస్ నాయకులు సోమవారం సత్కరించారు. అనకాపల్లి గాంధీనగరంలో ఉన్న ఆయన స్వగృహంలో పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కాళ్ళ సత్యనారాయణ, విన్నకోట రాము, పడాల కొండలరావు, సేనాపతి రాజు, కోట్ని మాణిక్యం, జి.శ్రీనివాస్, బాలమురళీ తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

అనకాపల్లి టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గవరపాలెంలో ఆదివారం రాత్రి ఒకరిపై జరిగిన హత్యాయత్నానికి సంబంధించి అందిన ఫిర్యాదు మేరకు నిందితుడ్ని అరెస్టు చేసినట్టు పట్టణ ఎస్ఐ డి. ఈశ్వరరావు తెలిపారు. సంతోషిమాత ఆలయ సమీపం గంగిరేవిచెట్టు వద్ద ఆదివారం రాత్రి ఇంటి మందడిగోడ విషయంలో జరిగిన సంఘటనలో యల్లపు రమేష్‌నాయుడును అదే ప్రాంతానికి చెందిన బొడ్డేడ శ్యామ్‌కుమార్ రాజా కత్తితో గాయపరిచి హత్యాయత్నానికి పాల్పడ్డాడని నిందితుడి ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు సోమవారం శ్యామ్‌కుమార్‌రాజాను అరెస్టు చేసినట్టు చెప్పారు.

ఉపకార వేతనాల దరఖాస్తులకు విద్యార్థుల బారులు



ఉపకార వేతనాల దరఖాస్తుల కోసం విద్యార్థుల కోలాహలం

చింతపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర కాఫీ బోర్డు కార్యాలయంలో ఉపకార వేతనాల దరఖాస్తుల కోసం విద్యార్థులు బారులు తీరారు. సోమవారం ఒకేసారి వందల సంఖ్యలో విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు వచ్చారు. దీంతో విద్యార్థులు గంటల తరబడి క్యూలో నిలబడి దరఖాస్తుచేసుకున్నారు. ఈ ఏడాది కాఫీ కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు అందజేస్తున్నది. దరఖాస్తు గడువు ఈనెల 30వ తేదీతో ముగుస్తుండడంతో ఇంటర్, డిగ్రీ, పీజీ, వృత్తి విద్య కోర్సుల విద్యార్థులు పోటీ పడ్డారు.

కౌమార బాలికల అభివృద్ధికి 'కిశోర వికాసం'

» సచివాలయాల జిల్లా నోడల్ అధికారి పీఎస్.కుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి పీఎస్.కుమార్

పాడేరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బాలికల సమగ్రాభివృద్ధికి చర్యలు చేపట్టేందుకే కిశోర వికాసం పేరిట ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతున్నదని గ్రామ సచివాలయాల వ్యవస్థ జిల్లా నోడల్ అధికారి పీఎస్.కుమార్ అన్నారు. స్థానిక కాఫీ హౌస్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కౌమార బాలికల వికాసం లక్ష్యంగా ప్రభుత్వాలు మిషన్ వాత్సల్య కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. ప్రధానంగా బాలికల వికాసం, విద్య, వైద్యం, పోషణ తదితర అంశాల్లో అభివృద్ధి సాధించడంతోపాటు బాల్య వివాహాలను అరికట్టడడం, బాలికలు స్వేచ్ఛగా ఎదిగేందుకు అవకాశం కల్పించడం ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్, విద్య, వైద్యం, పంచాయతీరాజ్, సచివాలయాలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

పాడేరు రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ శాఖ ఆధ్వర్యంలో మండలంలో ఈనెల 19 నుంచి 29వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులను నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజు కోరారు. ఆధార్ అప్‌డేట్, న్యూ ఎన్‌రోల్‌మెంట్, డాక్యుమెంట్ అప్‌డేట్స్, బయోమెట్రిక్ అప్‌డేట్స్ తదితర ఆధార్ సేవలను ఈ క్యాంప్‌లో నిర్వహించనున్నారన్నారు. మొదటి విడతగా ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు గొండెలి, పాడేరు-3, లగిశపల్లి సచివాలయాల్లో, ఐనాడ, దేవాపురం, నలుగు పంచాయతీల ప్రజలకు ఈదులపాలెంలో నిర్వహిస్తామన్నారు. రెండో విడతలో ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు గుత్తులపుట్టు, పాడేరు-2, వంతాడపల్లి, వంట్లమామిడి, మినుములూరు, తుంపాడ గ్రామ సచివాలయాల్లో ఆధార్ క్యాంప్‌లను నిర్వహిస్తున్నామన్నారు. 12 గ్రామ సచివాలయాల పరిధిలో ప్రజల ఆధార్ సీడింగ్‌లు చేసేందుకు చింతలవీధి, పాడేరు-3, వంట్లమామిడి, మినుములూరు డిజిటల్ ఆపరేటర్లతో పాటు మరో ఇద్దరు ఐటీడీఏ ఆపరేటర్లను వినియోగిస్తున్నామన్నారు. 0 నుంచి 6 ఏళ్ల లోపు పిల్లలకు తప్పని సరిగా ఆధార్ కార్డు కోసం నమోదు చేయించాలన్నారు. ఆధార్ కార్డు లేని పిల్లల జాబితాను మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తలకు అందజేస్తామన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ : ఇద్దరికి గాయాలు

పాడేరు రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జి.మాడుగుల మండలం బంధవీధి గ్రామ సమీపంలో సోమవారం మధ్యాహ్నం ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. తాడివీధి గ్రామానికి చెందిన సోమెలి రమణ మరో మహిళతో కలిసి పాడేరు నుంచి జి.మాడుగుల వైపు ద్విచక్రవాహనంపై వెళుతుండగా వెనుక వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమణ ఎడమ కాలు నుజ్జునుజ్జు అయ్యింది. బైక్ వెనుకన కూర్చున్న మహిళకు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను పాడేరు ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు జి.మాడుగుల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

» ముంచంగిపుట్టు వైస్ ఎంపీపీ భాగ్యవతి



అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటుతున్న వైస్ ఎంపీపీ

ముంచంగిపుట్టు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని వైస్ ఎంపీపీ ఎస్.భాగ్యవతి అన్నారు. మండలంలోని వనుగుమ్మ పంచాయతీ అస్రాడ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలు రకాల మొక్కలను నాటారు. అనంతరం వైస్ ఎంపీపీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్లాంటేషన్‌ను అభివృద్ధి చేయడం చాలా మంచిదన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి పరిరక్షణ బాధ్యత అందరూ తీసుకోవాలని కోరారు. మానవాళి మనుగడకు మొక్కలు ఎంతో కీలకమని, వాటిని సంరక్షణ ప్రతీ ఒక్కరూ తమ బాధ్యతగా తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త రాధిక, వైసీపీ నాయకుడు దేవ, బాలింతలు, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాలను శుభ్రంగా ఉంచుదాం..



డస్ట్‌బిన్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి, ఎంపీడీవో కుమార్

అనంతగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపడుతున్నామని ఎంపీపీ శెట్టి నీలవేణి, ఎంపీడీవో ఏవీవీ.కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని స్థానిక సర్పంచ్ రూతుతో కలిసి సోమవారం డస్ట్‌బిన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఆరోగ్యకరమైన వాతవరణం నెలకొల్పొదామని పిలుపునిచ్చారు. ఎక్కడ పడితే అక్కడ చెత్తచెదారం వేయకుండా డస్ట్‌బిన్లు వినియోగించాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు సహకారం అందిద్దామన్నారు. ఈ కార్యక్రమంలోని పంచాయతీ కార్యదర్శులు, ప్రజలు పాల్గొన్నారు.

హరహర మహాదేవ.. శంభో శంకర

» భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు... » మార్మోగిన శివనామస్మరణ



భక్తులతో కిటకిటలాడిన పాడేరు ఉమానీలకంఠేశ్వరుని ఆలయం



చింతపల్లి: బౌడ శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

పాడేరురూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీక మూడో సోమవారం శివాలయాలు శివ నామ స్మరణతో మార్మోగాయి. స్థానిక ఉమానీలకంఠేశ్వరస్వామి వారి సమేత రాజరాజేశ్వరి ఆలయం, పాత పాడేరులోని స్వయంభూ గౌరీ నీలకంఠేశ్వరుని ఆలయం, త్రిముఖ లింగేశ్వర స్వామి ఆలయాలు ఉదయం 5 గంటల నుంచి భక్తులతో కిటకిటలాడాయి. ఉమానీలకంఠేశ్వరుని ఆలయంలో ప్రధాన అర్చకులు ఉప్పల రామం పంతులు ప్రత్యేక అర్చనలు, పూజలను చేపట్టారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, రమాదేవి దంపతులు ప్రసాదం, తాగునీటి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కొట్టగుళ్లి రామారావు, వంతిని రాజుబాబు, దేశిది బాబూరావు, సిద్ధినాతి కొండలరావు, టీవీఎస్.ముకుందరావు, ఉప్పల వెంకటరత్నం, శివరాత్రి శ్రీనివాస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సీలేరు శివాలయంలో లక్ష బిల్వార్చన చేస్తున్న అర్చకులు

సీలేరులో..

జీకేవీధి మండలం సీలేరు, ధారకొండల్లో కార్తీక మూడో సోమవారం శివాలయాలు శివ నామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజాము నుంచే మహిళలు సీలేరు నదిలో స్నానాలను ఆచరించి దీపాలను వెలగించారు. అనంతరం శివాలయం ధ్వజస్తంభం వద్ద 360 ఒత్తులను వెలిగించి పూజించి, శివుడిని దర్శించుకున్నారు. సీలేరు, ధారకొండ శివాలయాల్లో రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, సామూహిక కుంకుమార్చన వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం నుంచి శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ కమిటీ అన్నప్రసాదం ఏర్పాటు చేసింది.

చింతపల్లిలో..

కార్తీక మూడో సోమవారం కావడంతో మండలంలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. అంతర్ల, బౌడ శివాలయాల్లో ఉదయం ఆరు గంటల నుంచే పూజలు ప్రారంభమయ్యాయి. ఆలయాల్లో అర్చకులు అభిషేకాలు, కుంకుమార్చనలు భక్తులతో చేయించారు. భక్తుల కోసం ఆలయ కమిటీ సభ్యులు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె

» సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.సుందరరావు



దీక్ష శిబిరం వద్ద మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు సుందరరావు

పాడేరురూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 25వ తేదీ నుంచి పూర్తి స్థాయిలో సమ్మె చేస్తామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.సుందరరావు హెచ్చరించారు. 108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం ఎదురుగా ఒకరోజు రిలే నిరాహార దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా శిబిరాన్ని సందర్శించిన సుందరరావు ఉద్యోగుల పోరాటానికి మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా విద్య, వైద్య రంగాలను ప్రభుత్వమే నిర్వహించాలని, అప్పుడే ప్రజలకు సరైన సేవలు అందుతాయన్నారు. 108 ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.త్రినాధరావు, బి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కోరుతూ 108 వాహన నిర్వహణ యాజమాన్యానికి, ప్రభుత్వాధికారులకు వినతులు అందిస్తూ శాంతియుతంగా నిరసన కార్యక్రమాలను చేపట్టామన్నారు. ఈనెల 11వ తేదీన అధికారులకు, యాజమాన్యానికి సమ్మె నోటీసు అందించామన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం, అధికారులు స్పందించి తమ న్యాయమైన డిమాండ్‌లు ఈఎంటీ, పైలెట్‌ల గ్రాట్యూటీ, ఎర్నెడ్ లీవ్ అమౌంట్, వార్షిక ఇంక్రిమెంట్‌ల వంటి వాటిని చెల్లించాలని, ఉద్యోగులను వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగులుగా గుర్తించి 108 సర్వీస్‌లను ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. ఇతర డిమాండ్లను పరిష్కరించకుంటే ఈనెల 25వ తేదీ నుంచి 108 వాహన సర్వీస్‌లను పూర్తి స్థాయిలో నిలిపివేస్తామన్నారు. ఈ దీక్షలో రాష్ట్ర కమిటీ సభ్యులు డి.నాగేశ్వరరావు, కోశాధికారి టి.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలతో రికార్డులు కొనుగోలు చేయించడం తగదు

» సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్



సమావేశంలో మాట్లాడుతున్న చిన్నయ్యపడాల్

పాడేరురూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం ఉచితంగా అందించాల్సిన సామగ్రిని కార్యకర్తలతో కొనుగోలు చేయించడం సూపర్‌వైజర్లు, సీడీపీవోలకు తగదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ అన్నారు. సోమవారం ఆయన సీఐటీయూ కార్యాలయంలో మాట్లాడుతూ.. చాలీచాలనీ వేతనాలతో జీవనం గడుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలను కొన్ని మండలాల్లో సూపర్‌వైజర్లు, సీడీపీవోలు ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. 2018 నుంచి నేటి వరకు కేంద్రం నిర్వహణకు ఉపయోగించే రికార్డులు, చార్టులు, పేపర్లు, స్కెచ్‌పెన్‌లతోపాటు గ్యాస్ రెగ్యులేటర్లు, కుక్కర్లు, మొబైల్ డేటా బేలన్స్‌లను అంగన్‌వాడీల జీతాలతోనే కొనుగోలు చేయిస్తున్నారన్నారు. ప్రస్తుతం సెంటర్‌లో ప్రీస్కూల్ టైం టేబుల్ బ్యానర్, మెన్యూ చార్టు, ఉచిత అత్యఅవసర హెల్ప్‌లైన్ నెంబర్ల చార్టు అంగన్‌వాడీ కార్యకర్తలే ప్రింటింగ్ చేయించాలని, ప్రతీ కార్యకర్త రూ. 500 నుంచి రూ. 600 వరకు ఇవ్వాలంటూ సూపర్‌వైజర్లు వత్తిడి చేయడం అన్యాయమన్నారు. కొన్ని ప్రాంతాల్లో అంగన్‌వాడీ భవనాల మరమ్మతులు, తలుపులు, కిటికీలు, ద్వారబంధాలు అంగన్‌వాడీలేవ కొనుగోలు చేయాలని సీడీపీవోలు వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ దృష్టి సారించి, ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్న కార్యకర్తలకు న్యాయం చేయాలన్నారు. సూపర్‌వైజర్లు, సీడీపీవోల వేధింపులు ఆగకుంటే చలో కలెక్టరేట్ నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్‌బీ.పోతురాజు, బి.సన్నిబాబు, కొర్రా శంకరరావు, జి.సత్యనారాయణ, జీనబంధు పాల్గొన్నారు.

ఆధార్ శిబిరాలు వినియోగించుకోండి

» ఎంపీడీవో ఏవీవీ.కుమార్

అనంతగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పినకోట, అనంతగిరి, కాశీపట్నం సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలను నిర్వహిస్తున్నామని, ఆయా గ్రామ సచివాలయాల పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఏవీవీ.కుమార్ సూచించారు. ఈ శిబిరాల్లో నూతన ఆధార్ కార్డులు, ఆధార్ అప్డేట్, పుట్టిన తేదీల మార్పులు, చేర్పులు, ఫోన్ నంబరు, ఈమెయిల్ ఐడీ అనుసంధానం చేయనున్నట్టు ఆయన వివరించారు.

అలంకారప్రాయంగా సెల్‌వన్ టవర్ జనరేటర్



నిరుపయోగంగా ఉన్న జనరేటర్

ముంచంగిపుట్టు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ సెల్‌వన్ టవర్ జనరేటర్ అలంకారప్రాయంగా మారింది. విద్యుత్ అంతరాయం ఏర్పడిన వెంటనే జనరేటర్ సాఆయంతో సెల్‌టవర్‌ను వినియోగంలోకి తీసుకురావల్సి ఉంది. సంబంధిత అధికారులు ఆ దిశగా దృష్టిసారించడంలేదు. కొద్ది రోజులుగా అవసరమైన సమయాల్లో జనరేటర్‌ను వినియోగించిన సందర్భాలు కానరాలేదు. దీంతో లక్షలాది రూపాయలు వెచ్చించి జనరేటర్‌ను ఏర్పాటు చేసినా ఫలితం లేకపోతోంది. ప్రస్తుతం సెల్ టవర్‌కు సంబంధించి బ్యాకప్ బ్యాటరీలు కాలం చెల్లిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోతే సమాచార వ్యవస్థ మూగబోతోంది. అయితే విద్యుత్ సరఫరా నిలిచిపోయిన వెంటనే జనరేటర్ సహాయంతో సెల్ టవర్‌ను వినియోగంలోకి తేవాల్సి ఉంది. కానీ అధికారులు మూలకు చేరిన జనరేటర్‌ను పట్టించుకోకపోవడంతో ఫలితం ఉండటం లేదు. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే చాలు గంటలు తరబడి సెల్ సిగ్నల్‌తో పాటు ఇంటర్‌నెట్ సేవలు, సెల్ సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఫలితంగా బీఎస్ఎన్ఎల్, ఎయిర్‌టెల్ వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జనరేటర్‌ను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.

అరకు పాఠశాలను సందర్శించిన డీఈవో



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీరావు

డుంబ్రిగుడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అరకు ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని, వారానికి ఒకసారి అసెస్మెంట్స్ నిర్వహించాలని ఉపాధ్యాయులకు చెప్పారు. అలాగే పాఠశాల రిజిస్టర్లు తనిఖీ చేశారు. అపార్ ఎంత వరకు పూర్తి చేశారని డీఈవో ఆరా తీశారు.

జాతీయ రహదారి నిర్మాణంతో భక్తుల ఇబ్బందులు



పెదమాకవరంలో ఆలయ వద్ద భక్తుల స్నానాలకు వీలుగాలేని ఉత్తర వాహిని

కొయ్యూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో పురాతన పుణ్యక్షేత్రమైన పెదమాకవరం స్వయం భూ బ్రహ్మ లింగేశ్వర స్వామిని దర్శించుకునే వీలులేక భక్తులు అసంతృప్తికి లోనవుతున్నారు. గ్రామ సమీపంలో ఉత్తర వాహిని ప్రాంతం జాతీయ రహదారి 516 ఈ నిర్మాణంతో ఇక్కడ స్నాన మాచరించేందుకు అనువుగా లేక ఈ పరిస్థితి నెలకొంది. ఏటా కార్తీక మాసంలో ఈ ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. ఈ పరిస్థితి ఈ ఏడాది లేకుండా పోయింది. ఆలయానికి వచ్చే భక్తులు అక్కడి సమీపంలోని ఉత్తర వాహినిలో స్నానమాచరించి రావటంఆనవాయితీ. జాతీయ రహదారి నిర్మాణాలతో ప్రవాహంలోకి అడుపెట్టే అవకాశం లేకుండా ఆ మార్గాన్ని పూర్తిగా కప్పివేశారు. దీనికితోడు నీరు కలుషితమైంది. పెద్ద గోతులు ఎక్సకవేటర్లతో తవ్వి వదిలారు. ఫలితంగా సుదూర ప్రాంతాల నుంచి స్వామి వారిని దర్శించుకునేందుకు వస్తున్న భక్తులు స్నానమాచరించకుండా దర్శించుకోకూడదనే భక్తి భావంతో వెనుతిరుగుతున్నారు. రహదారి నిర్మాణ కాంట్రాక్టర్ కార్తీకం చివరి రోజైన భక్తులు ఉత్తర వాహినిలో స్నానమాచరించేలా ఏర్పాట్లు చేయాలని పలువురు కోరుతున్నారు.

పక్కా గృహాలకు రూ.ఐదు లక్షలు ఇవ్వాలి

» ఎంపీటీసీ సభ్యుడు బుజ్జిబాబు



ఎంపీడీవోకి వినతిపత్రం అందజేస్తున్న సంఘాల నాయకులు

గూడెంకొత్తవీధి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పీవీటీజీల పక్కా గృహాల నిర్మాణాలకు రూ. ఐదు లక్షలు కేటాయించాలని స్థానిక ఎంపీటీసీ సభ్యుడు బుజ్జిబాబు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో పీవీటీజీలు పక్కా గృహాల నగదు పెంచాలని ర్యాలీ చేపట్టారు. అనంతరం ఎంపీడీవో వై.ఉమామహేశ్వరావుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బుజ్జిబాబు మాట్లాడుతూ పీవీటీజీ పక్కా గృహాల నిర్మాణాలకు రూ.2.39 లక్షలు చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ నిధులు పక్కా గృహాల నిర్మాణాలకు సరిపడడం లేదన్నారు. ప్రభుత్వం కనీసం రూ.ఐదు లక్షలు కేటాయిస్తే సింగల్ బెడ్ రూం గృహం నిర్మించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘాల నాయకులు సర్పంచ్ వంశీకృష్ణ, కొర్ర జగన్, అశోక్, జిన్ను, గెమ్మెలి పరమేశ్, అడపా విష్ణుమూర్తి పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సర్పంచ్‌కు ఉషారాణికి వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

పాడేరురూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 104 ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి స్థానిక ప్రజాప్రతినిధులు కృషిచేయాలని ఏపీ 104 ఎంఎంయూ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.సూర్యనారాయణ, బి.రామ్మూర్తి నాయుడు కోరారు. సోమవారం వారు పాడేరు మేజర్ పంచాయతీ సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, ఎంపీటీసీ సభ్యురాలు వర్తన లింగమ్మ, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలను అందించారు. 104 సర్వీస్‌లను పీహెచ్‌సీల ద్వారా నిర్వహించాలని, బకాయి వేతనాలు చెల్లించాలని, 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈవోలకు ఉద్యోగ భద్రత కల్పించి, జీవో 7 ప్రకారం వేతనాలు చెల్లించాలని, మూడేళ్లగా బకాయి పడ్డ ఇంక్రిమెంట్‌లను యాజమాన్యం ఏరియర్స్ రూపంలో ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఉషారాణి మాట్లాడుతూ 104 ఉద్యోగుల సమస్యలపై పంచాయతీ తీర్మానం చేసి ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్య శాఖా మంత్రి, జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

పాడేరురూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఓపెన్ స్కూల్ 10వ తరగతి, ఇంటర్మీడియట్ తత్కాల్ ఆన్‌లైన్ అడ్మిషన్‌లకు ఈనెల 25వ తేదీ వరకు రూ. 600 లేటు ఫీజుతో దరఖాస్తు చేసుకొనే అవకాశం ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీవోఎస్ఎస్) కల్పించిందని జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి చేరేందుకు 14, ఇంటర్మీడియట్‌లో చేరేందుకు 15 సంవత్సరాలు నిండిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి గల అభ్యాసకులు వెబ్‌సైట్‌లో లేదా సమీపంలో ఉన్న ఓపెన్ స్కూల్ సెంటర్ ఉన్న పాఠశాలను సంప్రదించాలని ఆయన తెలిపారు.

జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కు సత్కారం



శ్రావణ్‌కు పుష్పగుచ్ఛం అందించి సత్కరిస్తున్న దృశ్యం

డుంబ్రిగుడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జీసీసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కిడారి శ్రావణ్‌కుమార్‌కు డుంబ్రిగుడ యువజన సంఘం అధ్యక్షుడు బాలకృష్ణ సోమవారం పుష్పగుచ్ఛం అందిస్తూ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం మన్య ప్రాంతంలోని ప్రజాసేవకు అంకితమవుతూ అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న నేపథ్యంలో శ్రావణ్‌కుమార్‌కు ప్రభుత్వం ఈ పదవిలో నియమించడం ఎంతో ఆనందకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి, మండల నాయకులు నర్సయ్య, బోంజుబాబు, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రోడ్లలో తు(తి)ప్పలు

జంగిల్ క్లియరెన్స్ చేయాలని ప్రయాణికులు, వాహన చోదకుల విన్నపాలు

ముంచంగిపుట్టు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రధాన రహదార్లలో తుప్పలు వాహన చోదకులు, ప్రయాణికులు తిప్పలు పడుతున్నారు. మండల కేంద్రం నుంచి కుమడ, లక్ష్మీపురం, జోలాపుట్టు, పెదబయలు తదితర రోడ్లకిరువైపులా తుప్పలు ఏపుగా పెరిగిపోయాయి. ఫలితంగా వాహనాలు దగ్గరకు వస్తేగాని గుర్తించలేని పరిస్థితి నెలకొంది. మండల కేంద్రం నుంచి కుమడ వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో రాకాసిరాయి ఘాట్ మలుపుల వద్ద పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. ప్రమాదకరమైన మలుపులకు తోడు రహదారులు పలు చోట్ల అంచులు దెబ్బతినడం, గతుకులు ఏర్పడడంతో అటుగా రాకపోకలు సాగించే వాహన చోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పలు సందర్భాల్లో ప్రమాదాల బారిన పడుతున్నారు. పెను ప్రమాదాలు జరగక ముందే సంబంధిత అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



రాకాసిరాయి సమీపంలో రహదారికి ఇరువైపులా పెరిగిపోయిన పిచ్చి మొక్కలు

వరిలో రెల్లరాల్చు పురుగు నివారణకు చర్యలు చేపట్టండి


రెల్లరాల్చు పురుగు

రోలుగుంట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వరిలో రెల్లరాల్చు పురుగుతో జాగ్రత్తగా ఉండాలని మండల వ్యవసాయాధికారి విజయలక్ష్మి సూచించారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల్లో వరి పొలాల్లో ఈ పురుగు ఎక్కువగా వ్యాపించి ప్రమాదం ఉందని చెప్పారు. వరి పంట గింజ దశలో ఉండగా ఈ పురుగు అధికంగా వస్తుందన్నారు. గొలను కొరికివేయడంతో గింజలు నేలరాలుతాయన్నారు. రెల్లరాల్చు పురుగు సాయంత్రం వేళల్లో మాత్రమే కనిపిస్తుందని, పగలంతా దుబ్బుల్లో దాగి ఉంటుందమని ఆమె వివరించారు. ఈ పురుగు నివారణకు ఇమామెక్టిన్‌బెంజోఏట్ అనే మందును 80 గ్రాములు ఒక ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు.

సూర్యఘర్ పథకానికి గొలుగొండ ఎంపిక

గొలుగొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సూర్యఘర్ పథకానికి ఎంపికైందని ఎంపీడీవో మేరీరోజీ తెలిపారు. గొలుగొండ పంచాయతీలో 542 విద్యుత్ సర్వీసులు ఉన్నాయన్నారు. ఆయా లబ్ధిదారులకు ఇంటింటికీ సోలార్ ఏర్పాటుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందని, లబ్ధిదారుడు రూ.10 వేలు వాటాగా చెల్లిస్తే సరిపోతుందని చెప్పారు. దీనిపై ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహిస్తామని ఆమె తెలిపారు.

ఇన్‌చార్జులే దిక్కు..!

మండల పరిషత్.. రెవెన్యూ.. విద్య.. పశు సంవర్థక.. హౌసింగ్.. ఇలా చెప్పుకుంటూ పోతే చాంతాడంత జాబితా..! ఇంతకీ ఏమిటీ లిస్టు, దాని పరిణామాల గురించి తెలిస్తే షాకవ్వాల్సిందే! ఆయా శాఖలకు పూర్తి స్థాయి అధికారులు లేకపోవడం.. పక్క మండలాల వారికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం.. వారు ఎప్పుడొస్తారో, వచ్చినా ఎంత సమయం ఉంటారో తెలియకపోవడం! ఒక్క మాటలో చెప్పాలంటే.. నాతవరం మండలంలో ఇన్‌చార్జి అధికారులే దిక్కుకావడం! ఫలితంగా ప్రభుత్వ పరమైన సేవలు చేరువకాకపోవడంతో మండల ప్రజలు దిక్కుతోచని స్థితిలో పడిపోవడం!

నాతవరం మండలంలో ఎక్కువ శాఖలకు ఇన్‌చార్జి అధికారులే!

- పక్క మండలాల అధికారులకు అదనపు బాధ్యతలు
- అక్కడి నుంచి ఎప్పుడు వస్తారో తెలియని దుస్థితి
- మండల ప్రజలకు సక్రమంగా అందని ప్రభుత్వ సేవలు


ఎంపీడీవో లేని మండల పరిషత్ కార్యాలయం ఇదే..

నాతవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎక్కువ మంది ఇన్‌చార్జి అధికారులే పనిచేస్తున్నారు. వారంలో రెండు లేక మూడు రోజుల మాత్రమే వారు విధులు వస్తున్నారు. దీంతో సరైన సేవలు అందక మండల ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినప్పటికీ జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు.

నాతవరం మండల పరిషత్ కార్యాలయంలో పూర్తిస్థాయి ఎంపీడీవో లేరు. దీంతో నర్సీపట్నం ఎంపీడీవో ఉషశ్రీని ఇన్‌చార్జిగా నియమించారు. ఆమె వారంలో ఒక్కసారి మాత్రమే విధులకు వస్తారని, అది కూడా ఏ రోజో తెలియదని మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీంతో మండల పరిషత్ కార్యాలయం నుంచి సరైన సేవలు అందడం లేదని వాపోతున్నారు. అలాగే నాలుగు నెలల క్రితం నాతవరం గ్రంథాలయాధికారి కన్నబాబు ఉద్యోగ విరమణ పొందారు. దీంతో రోలుగుంట గ్రంథాలయాధికారిని ఇక్కడ ఇన్‌చార్జిగా నియమించారు. ఆమె కూడా వారంలో ఒక్క రోజు మాత్రమే విధులకు వస్తున్నారని, దీంతో పోటీ పరీక్షల పుస్తకాలు చదువుకునే సౌకర్యం ఉండడం లేదని నిరుద్యోగ యువతీ, యువకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక మండల విద్యా శాఖ అధికారి రెండు నెలల క్రితం ఉద్యోగ విరమణ పొందారు. దీంతో గొలుగొండ ఎంఈవోకు ఇక్కడ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయన కూడా వారంలో రెండు రోజులకు మించి రావడం లేదని, దీంతో వివిధ పాఠశాలల్లో సమస్యలు పరిష్కారం కావడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

అలాగే నాతవరం గృహ నిర్మాణ శాఖ ఏఈగా పనిచేస్తున్న రామజోగారావును గొలుగొండ హౌసింగ్ ఏఈగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో రామజోగారావు పూర్తి స్థాయిలో ఇక్కడ విధులు నిర్వహించకపోవడంతో గృహ నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయని లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు.

మండలంలోని గునుపూడి, శృంగవరం, నాతవరం గ్రామాలలో పశువైద్య కేంద్రాలు ఉన్నాయి. ఒక్క గునుపూడిలో మాత్రమే పశువైద్యాధికారి ఉండగా, మండల కేంద్రం నాతవరం, శృంగవరం పశువైద్య కేంద్రాలలో పశు వైద్యులు లేరు. దీంతో గునుపూడి పశు వైద్యాధికారి మోక్షరెడ్డిని రెండు రోజులు నాతవరం, రెండురోజులు శృంగవరం కేంద్రాలకు అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన ఏ పశువైద్య కేంద్రంలో ఉంటారో తెలియదు. ఫలితంగా పశులకు సరైన వైద్య సేవలు అందడం లేదని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో కూడా రెవెన్యూ అధికారి (ఆర్ఐ), సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, టైపిస్టు పోస్టులను భర్తీ చేయకపోవడంతో రైతులకు సరైన సేవలు అందడం లేదు. ప్రధానంగా మండలంలో ఇంకా ఏడు వీఆర్వో పోస్టులను భర్తీ చేయకపోవడంతో పాసు పుస్తకాలు, కుల ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందడం లేదని రైతులు, విద్యార్థులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మండలంలోని అన్ని శాఖలకు పూర్తిస్థాయి అధికారులను నియమించాలని, సకాలంలో ప్రభుత్వ సేవలు అందేలా చూడాలని మండల ప్రజలకు కోరుతున్నారు.

విహార యాత్రకు విద్యార్థులు

నర్సీపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వెంకునాయుడుపేట పాఠశాల విద్యార్థులను ఉపాధ్యాయులు సొంత ఖర్చుతో సోమవారం విశాఖపట్నం విహారయాత్రకు తీసుకువెళ్లారు. విమానాశ్రయానికి తీసుకువెళ్లి ఉపయోగాలు, రవాణా సౌకర్యాలను వివరించారు. అనంతరం జంతు ప్రదర్శన శాల, బీచ్‌కు తీసుకువెళ్లారు. యుద్ధ విమానం, సబ్ మెరైన్ చాంబర్స్‌లోకి తీసువెళ్లి, వాటి పని తీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం, కేజీహెచ్, నావెల్ డాక్ యార్డ్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం డీజీనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాగుదారులను గుర్తించరూ...

గొలుగొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సాగుదారులను గుర్తించి హక్కు పత్రాలు మంజూరు చేయాలని ఏపీ ఆదివాసీ సంఘ గౌరవ సలహాదారుడు పీఎస్.అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని పాతమల్లంపేట రెవెన్యూలో సుమారు 30 మంది ఆదివాసీలు ఎన్నో ఏళ్లుగా సాగులో ఉన్నారన్నారు. వారికి సాగు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీలు, రైతులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం సీపీఐ ఆందోళన

చోడవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పేదలకు పల్లెల్లో మూడు, పట్టణాల్లో రెండు సెంట్ల ఇల్ల స్థలాలు కేటాయించాలని జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గ్రామ సచివాలయం వద్ద సీపీఐ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఇంటి స్థలం కేటాయింపుతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం పంచాయతీ ఈవో నారాయణ రావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో స్థానిక కార్యకర్తలు, పేదలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ సాయం రూ.5 లక్షలకు పెంచాలి

కృష్ణాదేవిపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణదారులకు ప్రభుత్వం రూ.5 లక్షల సాయం ఇవ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు పాతకృష్ణాదేవిపేట పంచాయతీ కార్యదర్శికి సోమవారం వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం కాకి లెక్కలతో 32 లక్షల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చినప్పటికీ, పేదలు ఆ స్థలాల పట్ల సానుకూలత చూపలేదన్నారు. పైగా ఇళ్ల నిర్మాణాలకు ఇచ్చే ఆర్థిక సాయం రూ.1.8 లక్షలు కావడంతో నిధులు చాలక చాలా చోట్ల పునాదులకే పరిమితమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మేకా భాస్కరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు గురుబాబు, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడులో...

కె.కోటపాడు: గ్రామాల్లో నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం ధర్నా చేశారు.ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి గొర్లె దేవుడు బాబు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.1.8 లక్షలు ఇవ్వడంతో పేదలు ఇళ్ల నిర్మాణాలు ఆపేశారన్నారు. కూటమి ప్రభుత్వం గృహ నిర్మాణానికి అనువైన ప్రాంతాల్లో స్థలాలు గుర్తించి పేదలకు ఇవ్వడమే కాకుండా నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని ఆయన చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి రెడ్డి అప్పలనాయుడు, నాయకులు దమ్ము ముత్యాలనాయుడు, ఇల్లాకు రాము తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరణ

చోడవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ రద్దు చేయడంతో పాటు పాత పింఛను విధానం అమలు చేయాలన్న నినాదంతో డిసెంబరు 10న చేపట్టనున్న చలో విజయవాడ పోస్టర్లను సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా ఆర్థిక కార్యదర్శి జి.సింహాద్రప్పడు, జిల్లా కార్యదర్శి ఆర్. దేముడుబాబు తదతరులు సోమవారం ఆవిష్కరించారు. సీపీఎస్ ఉద్యోగులందరూ విజయవాడ తరలివచ్చి తమ డిమాండ్ల సాధనకు ఉద్యమించాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

1800 లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం

బుచ్చెయ్యపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంటికొర్లాం శివారు ప్రాంతంలో నాటుసారా స్థావరాలపై చోడవరం ఎక్సైజ్ సీఐ పాపునాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది సోమవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా కొండ వాలుల్లోని తుప్పల్లో నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1800 లీటర్ల బెల్లం పులుసు డ్రమ్ములను ధ్వంసం చేసి తగులబెట్టారు. ఈ దాడిలో ఎస్ఐ ఎం.శేఖరం, హెచ్‌సీ ఎం.అప్పారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నాన్ పాలిథిన్ బ్యాగ్‌ల పంపిణీ

నర్సీపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నియంత్రణలో భాగంగా భక్తులు పాలిథిన్ కవర్లతో పూజా సామగ్రి తీసుకు రావడాన్ని అరికట్టడానికి నాన్ వవెన్ బ్యాగులను సోమవారం పంపిణీ చేశారు. బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయం ఆవరణలో సంస్కృతి చారిటబుల్ సేవా సంఘం సభ్యులు ఈ కార్యక్రమం చేపట్టారు. ఆలయానికి ప్లాస్టిక్ కవర్లతో పూజా సామగ్రి తీసుకు రావడం నిషేధమని ఈ సందర్భంగా భక్తులకు అవగాహన కల్పించారు. ఆలయానికి వచ్చేటప్పుడు సంచిని ఉపయోగించాలని కోరారు.

ఎల్‌బి.పట్నంలో పూరిల్లు దగ్ధం

చీడికాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎల్‌బి.పట్నం గ్రామంలో డోకల పైడంనాయుడుకు చెందిన పూరిల్లు సోమవారం సాయంత్రం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. పైడంనాయుడు ఉదయం కూలి నిమిత్తం వేరోచోటకు వెళ్లి సాయంత్రం వచ్చేసరికి ఇల్లు పూర్తిగా దగ్ధమై కనిపించింది. కొంతమంది గ్రామస్థులు మంటలు అదుపు చేయడంతో మిగతా పూరిళ్లకు మంటలు సోకలేదు. ఈ ప్రమాదంలో ఇంటిలో ఉన్న రూ.10 వేల నగదు, ధాన్యం, బట్టలు కాలి బూడిదయ్యాయి. ఉప సర్పంచ్ కురచా నారాయణ మూర్తి రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు.

కలిసి పాడుదాం.. వందేమాతరం

నర్సీపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెదబొడ్డేపల్లి ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో బాల గాయకుడు, పాడుతా తీయగా విన్నర్ ధీరజ్ ఆధ్వర్యంలో సోమవారం కలిసి పాడుదాం... వందేమాతరం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో కలిసి వందేమాతరం గీతం ఆలపించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్క నాటి నీరు పోశాడు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం బాలికోన్నత పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

గోవాడను ఆదుకోండి: ఎమ్మెల్యే రాజు



చోడవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సహకార రంగంలో మిగిలిన ఏకైక గోవాడ షుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు విజ్ఞప్తి చేశారు. సోమవారం అసెంబ్లీలో మాట్లాడిన ఎమ్మెల్యే రాజు చోడవరం, మాడుగుల ప్రాంతాల్లోని 50వేల మందికి పైగా రైతులు, వందలాది మంది కార్మికులుకు ఏకైక జీవనాధారమైన గోవాడ షుగర్ ఫ్యాక్టరీ గతంలో ఆర్థికంగా ఎంతో ఉన్నతంగా నడిచిందని తెలిపారు. ప్రస్తుతం పంచదార ఉత్పత్తి వల్ల ఫ్యాక్టరీ ఆర్థికంగా ఎదిగే పరిస్థితి కనిపించడం లేదని, అందువల్ల ప్రభుత్వం ఫ్యాక్టరీని ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం లేదా ప్రైవేటు సహకారంతో గోవాడ ఫ్యాక్టరీలో డిస్టిలరీ ఏర్పాటు చేయడం ద్వారా గోవాడ ఫ్యాక్టరీని నిలబెట్టాలని కోరారు. గోవాడలో డిస్టిలరీ ఏర్పాటు చేయడం ద్వారా 25 వేల మంది సభ్య రైతులతో పాటు కార్మికులను కూడా ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ప్రమాదాల నివారణకు డివైడర్‌పై హెచ్చరిక బోర్డు


ప్రధాన రహదారిలోని డివైడర్ వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన యువకులు

చోడవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ప్రధాన రహదారిపై ప్రమాదాలకు నిలయంగా మారిన డివైడర్‌పై వాహనదారులకు కనిపించేలా స్థానిక తూర్పుకాపు సంక్షేమ సంఘం, కాపురాక్స్ యువకులు సోమవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ డివైడర్ వద్ద ఎలాంటి సూచికలు లేకపోవడంతో చీకటి పడితే చాలామంది వాహనదారులు ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇక రాత్రి సమయంలో కార్లు, ఇతర నాలుగు చక్రాల వాహనాలు ఎదురుగా వచ్చే వాహనాల లైటింగ్ కారణంగా డివైడర్ కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో తూర్పు కాపు యువజన సంక్షేమ సంఘం, కాపురాక్స్ యువకులు డివైడర్ కనిపించేలా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో సైతం కనిపించేలా రేడియం స్టిక్కర్లను కూడా అతికించారు. ఈ బోర్డు ఏర్పాటు చేసిన యువకులను స్థానిక ప్రజలు, వాహన చోదకులు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో తూర్పుకాపు యువజన సంఘం ప్రతినిధులు ఆకుల రమేష్, గోపి, శ్రీను, సూర్య, సతీష్, తాతారావు, వాసు, కోటి, మహేష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వన భోజనాలకు విశేష స్పందన

- అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు


వన భోజనాలకు హాజరైన భక్తులతో జాతర వాతావరణం కనిపిస్తున్న దృశ్యం

దేవరాపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) స్థానిక కూరగాయల మార్కెట్ వ్యాపారస్తులు రాయపురెడ్డి వారి మామిడి తోటలో, బీ.కింతాడలో సోమవారం నిర్వహించిన వన భోజనాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్తీక మాసం మూడవ సోమవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. దీంతో వన భోజనాల తోటల్లో జాతర వాతావరనం కనిపించింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, మహేశ్వరీ నాయుడు, వరదపురెడ్డి సింహాచలం నాయుడు, లలితానాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోతనవలస భూ రీ సర్వే గ్రామసభ


రీ సర్వే గ్రామసభలో అధికారులకు వినతులు అందిస్తున్న దృశ్యం

కె.కోటపాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతనవలస గ్రామంలో భూముల రీ సర్వే సమస్యల పరిష్కారం కోసం సోమవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చిరికి భార్గవి వెంకటరమణ, డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో సభ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రీ సర్వే భూ సమస్యల పరిష్కార గ్రామసభలను రైతులు సద్వినియోగపరుచుకోవాలని కోరారు. ఈ సభల్లో రైతులు ఇచ్చిన అర్జీలను అధికారులు నిర్దేశిత వ్యవధిలోగా పరిష్కరిస్తారని తెలిపారు. పలు సమస్యలపై రైతుల నుంచి 25 వినతులు వచ్చినట్టు వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ రామచంద్రరావు, గ్రామ సర్వేయర్లు కేశవ, త్రినాథ్, సూర్య ప్రకాష్, కిరణ్, జగదీశ్, నవీన్, గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో కూటమి సమన్వయ కమిటీలు

మూడు పార్టీల కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి

జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు


సమావేశంలో మాట్లాడుతున్న నియోజవర్గ ఇన్‌చార్జి రాజు

చోడవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందేలా చొరవ చూపించాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని రావికమతం మండలం కొత్తకోట గ్రామంలో ఆదివారం రాత్రి నిర్వహించిన జనసేన నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడవారు. నియోజకవర్గంలో గ్రామ స్థాయిలో కూటమి నేతల సమన్వయ కమిటీలు ఏర్పాటు చేయాలని, కూటమి స్ఫూర్తితో కమిటీలు పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా కూటమిలో జనసేన నాయకులకు, కార్యకర్తలకు కలుగుతున్న ఇబ్బందులను చర్చల ద్వారా సామరస్యంగా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని ఆయన హామీ ఇచ్చారు. నియోజకవర్గం అభివృద్ధికి జనసేన కార్యకర్తలంతా కట్టుబడి ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నాలుగు మండలాలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోండి


అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

మాకవరపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పైనీయర్ (అన్‌రాక్) కంపెనీ ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూములను రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులు స్వాధీనం చేసుకోవాలని టీడీపీ నాయకుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అల్లురామునాయుడు డిమాండ్ చేశారు. పైనీయర్ ఆధ్వర్యంలో ఉన్న భూములపై రెవెన్యూ అధికారులకు టీడీపీ నాయకులతో కలిసి సోమవారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2007లో అన్‌రాక్ కంపెనీ భూసేకరణలో 2,400 ఎకరాల భూమిని తీసుకొని 1800 ఎకరాల్లో మాత్రమే కంపెనీ నిర్మాణం చేపట్టిందన్నారు. మిగిలిన భూములను ఖాళీగా కంపెనీ వద్దే ఉంచుకుందన్నారు. అలాగే కంపెనీకి ఆనుకొని ఉన్న రాచపల్లి, జి.వెంకటాపురం, ధర్మవరం, జి.కోడూరు, రామన్నపాలెం, తామరం గ్రామాల్లో రైతులకు చెందిన సుమారు 500 ఎకరాల జిరాయితీ భూములను ఏపీఐఐసీ రికార్డుల్లో నమోదు చేసి, రైతులకు ఆన్‌లైన్ కాకుండా కంపెనీ యాజమాన్యం అడ్డు పడుతుందన్నారు. దీనికితోడు తామరం రెవెన్యూలో సుమారు 88 ఎకరాల ఏపీఐఐసీ ప్రభుత్వ భూమిని అన్‌రాక్ గుప్పెట్లో పెట్టుకుందని ఆరోపించారు. ఈ భూమి రెవెన్యూదైనా చుట్టూ కంపెనీ సెక్యూరిటీ గార్డులు కాపాలా ఉంటున్నారని పెర్కొన్నారు. తక్షణమే 88 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాలని, అలాగే రైతుల జిరాయితీ భూములను ఏపీఐఐసీ రికార్డుల నుంచి తొలిగించి రైతుల పేర్ల మీద ఆన్‌లైన్ చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు రుత్తల జోగిపాత్రుడు, భీమబోయినపాలెం సర్పంచ్ రుత్తల నందకిశోర్, మండల యూత్ ఉపాధ్యక్షుడు గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణంతో తీరిన కష్టాలు: మాజీ మంత్రి బూడి


నూతనంగా నిర్మించిన వంతెనను పరిశీలిస్తున్న మాజీ మంత్రి బూడి

మాడుగుల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వంతెన నిర్మాణంతో రైతులు, ప్రజల కష్టాలు తీరాయని మాజీ మంత్రి, వైసీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు పేర్కొన్నారు. సోమవారం మాడుగుల వచ్చిన ఆయన సాగరం దారిలో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన నిధులతో నూతనంగా నిర్మాణం చేపట్టిన వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల కాలంగా తాచేరు కాలువపై వంతెన నిర్మాణం చేపట్టాలని రైతులు, నాయకులకు విన్నవించుకున్నప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. ఈ సమస్యపై పత్రికల్లో కథనాలు రావడంతో అక్కడికి వెళ్లి పరిశీలించిన అనంతరం వంతెనతో పాటు రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. అలాగే మాడుగుల నియోజకవర్గ ప్రధాన కేంద్రంలో ఆర్‌అండ్‌బీ వసతి గృహం స్థలంలో పంచాయతీరాజ్ అతిథి గృహం నిర్మించామన్నారు. అంతకుముందు వంతెన నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారాం, వైస్ ఎంపీపీ కె.శ్రీను, జట్పీటీసీ సభ్యురాలు రమణమ్మ, సర్పంచ్ యడ్ల కళావతి, వైసీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీను, నాయకులు జవ్వాది వరహాలు, శ్రీధర్, సత్తిబాబు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు

దేవరాపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చింతలపూడి పంచాయతీలో వీరబద్రపేట, బుల్లిపురంతో పాటు పలు గిరిజన గ్రామాల్లో సోమవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు ముమ్మరంగా జరిగాయి. పార్టీ నేత శెట్టి అప్పలకొండ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. పార్టీ నేతలు దెబరి రాజుబాబు, బుచ్చిబాబు, కొమ్మ శంకరు పాల్గొన్నారు. రైవాడలో చల్లా నానాజీ, తాతయ్యలు, దుక్క ఈశ్వరరావు సభ్యత్వ నమోదు చేపట్టారు.

భక్తులతో కిట కిటలాడిన శివాలయాలు

నర్సీపట్నం/చోడవరం/మాడుగుల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా శివాలయాలు హర హర మహా దేవ శంభో శంకర నినాదాలతో మార్మోగాయి. నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నర్సీపట్నం, పెదబొడ్డేపల్లి, బలిఘట్టంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బలిఘట్టం శ్రీబ్రహ్మలింగేశ్వర స్వామి ఆలయానికి భక్తులు భారీగా తరలి వచ్చారు. భక్తుల తాడిని దృష్టిలో ఉంచుకొని అభిషేకాలు ఆపేసి భక్తులకు ప్రత్యేక దర్శనం కల్పించారు. స్ఫటిక లింగం రూపంలో ఉన్న స్వామివారికి భక్తులు పూజలు ప్రసాదాలు స్వీకరించారు.


బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


రోడ్డు నిర్మాణానికి అడ్డంకులు తొలగించాలని బైఠాయించిన రాజులవీధి వాసులు

రోడ్డు నిర్మాణానికి అడ్డంకులు తొలగించాలని నిరసన

దేవరాపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజులవీధిలో రోడ్డు నిర్మాణానికి అడ్డంకులు తొలగించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ప్రజలు రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఎన్నో ఏళ్లుగా వీధికి డ్రైనేజీ, రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణమూర్తి రూ.13 లక్షలు మంజూరు చేసి శంకుస్థాపన చేశారన్నారు. ఈ పనులను సోమవారం ప్రారంభించడంతో పలువురు అడ్డు తగులుతున్నారని, దీనిపై అధికారులు స్పందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు కాలనీ రహదారిపై రోడ్డుపై బైఠాయించి డ్రైనేజీ, రోడ్డు నిర్మాణం చేపట్టాలని నినాదాలు చేశారు. దీనిపై ప్రభుత్వం తక్షణమే సర్వే చేసి ఆక్రమణలు తొలగిస్తే అడ్డంకులు ఉండవని వారు స్పష్టం చేశారు.

‘బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం...’

నర్సీపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొత్తవీధి హత్య కేసులో మృతి చెందిన సర్వసుద్ధి నాగేశ్వరావు కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటామని కౌన్సిలర్ చింతకాయల పద్మావతి హామీ ఇచ్చారు. సోమవారం మృతిని భార్య నాగలక్ష్మి, కుటుంబ సభ్యులను స్పీకర్ భార్య, కౌన్సిలర్ పద్మావతిని కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

మగ మహారాజులు

పురుషులకూ ఓ రోజుంది!

వారి గొంతు వినిపించుకునే వేదిక



- సాధించిన ఘనకార్యాలు చెప్పుకోవచ్చు
- ప్రపంచ వ్యాప్తంగా 80 దేశాల్లో నిర్వహణ
- 1990 నుంచి ప్రారంభమైన ఆనవాయితీ
- నేడు అంతర్జాతీయ పురుషుల దినోత్సవం

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి):

జీవితం ఓ ప్రయాణం... అది సాఫీగా సాగాలంటే ఒడిదుడుకులు లేని జీవనం అవసరం... కుటుంబ వ్యవస్థలో దంపతులు జోడుగుర్రాల వంటివారు. జీవనయానంలో ఇద్దరి పాత్ర అనన్య సామాన్యమే అయినా కొన్ని సందర్భాల్లో పురుషుల ప్రాధాన్యం కాదనలేని వాస్తవం. 'ఇంటిని తీర్చిదిద్దేది ఇల్లాలే అయినా సమాజాన్ని జయించాల్సింది పురుషుడే' అన్నది కొందరి వాదన. 'బిడ్డ జీవితాన్ని ప్రారంభించేందుకు పెంపకం ద్వారా ప్రతి తండ్రి సాయపడతాడు.. అంతకంటే ముఖ్యంగా అతన్ని సంపూర్ణ వ్యక్తిగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తాడు'... అంటారు వీరు. పురుషాధిక్య సమాజం అంటూ మహిళలకు చట్టపరమైన రక్షణ కల్పిస్తున్న ప్రభుత్వాలు తమ పట్ల వివక్ష చూపుతున్నాయని కొందరి మగాళ్ల వాదన. అదే రక్షణకు మేమెందుకు అర్హులం కాదన్నదే 'పురుషుల ప్రశ్న'. సమున్నత ఆశయంతో ప్రభుత్వం కల్పించిన చట్టపరమైన రక్షణ కొందరు మహిళల తీరు వల్ల పురుషులకు శాపంగా మారుతోందని, ఈ పరిస్థితుల్లో మాకూ రక్షణ కావాలన్నది పురుష సమాజం డిమాండ్. అలాంటి డిమాండ్ నుంచి ఉద్భవించిందే పురుషుల దినోత్సవం.

పితృస్వామ్య వ్యవస్థలో పురుషునిదే ఆధిపత్యం. అయినా ఇది నూరుశాతం నిజం కాదు. అక్కడక్కడా మహిళల వేధింపులు, వివక్షకు గురవుతున్న పురుషులున్నారు. 'భార్యాభర్తల సంఘం' ఏర్పడడానికి ఈ వివక్షే కారణం. కుటుంబంలో తమ మాట చెల్లుబాటు కావడం లేదని, భార్య ఆధిపత్యమే కొనసాగుతోందని, వేధింపులకు గురవుతున్నానని ఈ సంఘం సభ్యులు చెబుతుంటారు. ఇటువంటి సందర్భాలే ప్రత్యేకంగా పురుషుల దినోత్సవం నిర్వహించేందుకు కారణమయ్యాయి.

ఎలా ఏర్పడింది?


అనాదిగా పురుషులు సమాజానికి 'రోల్‌మోడల్స్' అన్న అభిప్రాయం ఉంది. దీనికి ప్రత్యక్ష కార్యాచరణ 'పురుషుల దినోత్సవం' అంటారు. తొలుత థామస్ హేస్టర్ మదిలో ఈ ఆలోచన వచ్చింది. ఎన్నో ప్రత్యేక దినోత్సవాలు నిర్వహిస్తుండగా పురుషుల కోసం ఎందుకు ఓ రోజు ఉండకూడదని భావించాడు. 1989లో ఫుట్‌బాల్ ఆటకు ప్రపంచస్థాయి గుర్తింపు వచ్చింది. అదే ఏడాది నవంబరు 19న తన తండ్రి పుట్టినరోజు రావడంతో ఆ రోజున 'పురుషుల దినోత్సవం' నిర్వహించాలని ప్రతిపాదించాడు. అంతవరకు ఇటువంటి ఆలోచన ఎవరికీ రానందున చాలామంది దీనిని అంగీకరించారు ఐక్యరాజ్య సమితి వద్దకు ఈ ప్రతిపాదన వెళ్లగానే వారు కూడా నవంబరు 19న 'అంతర్జాతీయ పురుషుల దినోత్సవం' నిర్వహించేందుకు ఆమోదం తెలిపారు. ఈ దినోత్సవాన్ని 1982 వరకు నామమాత్రంగా నిర్వహించినా ఆ తర్వాత విస్తృత ప్రాచుర్యం లభించింది. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 80 దేశాల్లో ఈ రోజున పురుషులు సాధించిన విజయాలపై ప్రచారం చేయడానికి ప్రత్యేక తరహా కార్యక్రమాలు రూపొందిస్తున్నారు.

పురుష దినోత్సవ లక్ష్యాలివీ...

పురుషులకు సమాజంలో ప్రత్యేకత ఉంది. కానీ చాలా దేశాల్లో స్త్రీపురుషుల మధ్య సమానత్వం లేదట. పురుషులు వివక్షకు గురవుతున్నారన్నది ఓ భావన.

పురుషులు కూడా స్త్రీలతో సమానమేనని, ఆర్థిక సామాజిక సేవా గుణాలతో పాటు శారీరక బలంలో సమానమేనని ప్రచారం చేయడం కోసం దినోత్సవాన్ని వినియోగించాలన్నది మరో ఉద్దేశం.

స్త్రీ, పురుషుల మధ్య విభేదాలు, అభిప్రాయ భేదాలు లేకుండా ఉండాలని, ఇద్దరూ వేర్వేరు అనే భావన లేకుండా చేయడానికి దీనిని ఉపయోగించుకోవాలన్నది లక్ష్యం.



పురుషుల ఆరోగ్య అంశాల అభివృద్ధికి, ఇతరత్రా అంశాల పరిరక్షణకు, వారి అభ్యున్నతికి కృషి చేయడానికి దినోత్సవం అవసరమని భావించారు.

సమాజ గతిని మార్చే శక్తి పురుషులకు మాత్రమే ఉందని నిరూపించడానికి వీలు. సమాజంలో జరిగే వివిధ అభివృద్ధి కార్యక్రమాలలో పురుషుల భాగస్వామ్యం ఎంతో ఉందని తెలియజేయడానికి దీనిని వేదికగా మార్చుకుంటున్నారు.

పురుషుడి విలువ, బాధ్యత కుటుంబానికి, సమాజానికి అవసరమని తెలియజేయడం.

సమాజంలో మానవతా విలువల్ని పెంపొందించడానికి పురుషుల ద్వారా వివిధ సేవా కార్యక్రమాలను చేపట్టడానికి, వారి ప్రత్యేకతను నిలబెట్టడానికి ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

దేశంలో పురుష సంఘాలు

మన దేశంలో ఏ సంఘం ఏర్పాటైనా కార్యవర్గంలో కొందరు స్త్రీలు ఉండాలన్న నిబంధన ఉంది. కానీ మహిళా సంఘాలకు ఈ నిబంధన వర్తించదు. అందుకే కేవలం పురుషులు మాత్రమే ఉన్న సంఘాలు ఏర్పాటు కావాలన్న డిమాండ్ మొదలయింది. మొట్టమొదటి సంఘం 1989లో పుణేలో ఏర్పాటైంది. ఈ సంఘం ప్రత్యేకంగా సమావేశమై పురుషులకు జరిగిన అన్యాయాలపై చర్చిస్తుంది. ఈ సంఘంతోపాటు భార్యాబాధితుల సంఘం కూడా కొన్ని రాష్ట్రాల్లో పనిచేస్తోంది. కుటుంబ పరంగా ఇబ్బంది ఎదురైన వారంతా కలిసికట్టుగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారు. రానున్న కాలంలో మరిన్ని పురుషుల సంఘాలు ఏర్పాటయ్యే అవకాశం ఉంది.

ప్రతి ఏటా సరికొత్త నినాదం

అంతర్జాతీయ పురుషుల దినోత్సవం సందర్భంగా ఏటా ఓ సరికొత్త నినాదం సమాజం ముందుకు వస్తోంది. 2002 నుంచి దీనిని అమల్లోకి తెచ్చారు. 2002లో శాంతి సమాజం, 2003లో పురుషుల ఆరోగ్యం, 2007లో స్వస్థత, క్షమాగుణం, 2008లో గౌరవం, త్యాగం, 2009లో ఆదర్శ, స్ఫూర్తిదాయక పురుషులు, 2010 మన సంతానం, భవిష్యత్తు, 2011 మగపిల్లలకు ఉత్తమ జీవన ఆరంభాన్ని అలవాటు చేయడం, 2012లో సంతోషదాయక, ఆరోగ్య జీవితాన్ని గడిపేందుకు పురుషులకు సహాయ పడడం, 2013లో పురుషులు, మగపిల్లల సంరక్షణ, 2014లో పురుషులు, మగపిల్లల కోసం సమష్టిగా పనిచేయడం, 2015లో పురుషుల పునరుత్పత్తిని పెంచడా నికి కృషి, 2016లో పురుషుల ఆత్మహత్యలు ఆపండి, 2017లో పురుషుల్లో వైవిధ్య ధోరణి, 2018లో పురుషుల శ్రేయస్సు, 2019లో సానుకూల మోడల్‌ను హైలెట్ చేయడం, 2020లో సంపూర్ణ పురుషుల ఆరోగ్యం, 2021లో స్త్రీ, పురుషుల మధ్య సరైన అవగాహన, 2022లో బాలలు, పురుషులకు సహాయపడడం, 2023లో పురుషుల ఆత్మహత్యల నివారణ, ఈ ఏడాది సానుకూల రోల్ మోడల్‌గా గుర్తింపు అనే నినాదాలతో జరుపుకుంటున్నారు.

10న 'సీపీఎస్'కు వ్యతిరేకంగా బహిరంగసభ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏపీ సీపీఎస్‌ఈఏ ప్రతినిధులు

- విజయవంతానికి ఏపీ సీపీఎస్‌ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు సతీశ్ పిలుపు

అనకాపల్లి టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సీపీఎస్ విధానానికి వ్యతిరేకంగా జీపీఎస్ ఉద్యోగులు డిసెంబరు 10వ తేదీన విజయవాడలో నిర్వహించ తలపెట్టిన భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఏపీ సీపీఎస్‌ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు కోరుకొండ సతీష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియం వద్ద బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. గత ఎన్నికల ముందు సీపీఎస్‌ను రద్దు చేస్తామని మాట ఇచ్చి అధికారంలోకి వచ్చిన వైసీపీ, ఆ తరువాత సీపీఎస్‌ను రద్దు చేయకపోగా ఉద్యోగులకు రావాల్సిన అన్ని రకాల సౌకర్యాలు రాకుండా ఎన్నో ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం దృష్టికి సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ ఇవ్వాలని , సీపీఎస్ ఉద్యోగుల చిరకాలవాంఛ నెరవేర్చాలని తీసుకు వెళ్లినట్టు చెప్పారు. ఈ విషయమై మానవ హక్కుల దినోత్సవం రోజు డిసెంబరు పదో తేదీన నిర్వహించే ధర్నాను అంతా విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు బోయిన చిన్నారావు, రొంగలి అప్పలరాజు, నాగేశ్వరరావు, కిరిటీ, గౌరీనాయుడు, కిశోర్, మధు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పెట్రోల్, డీజిల్ సబ్సిడీకి దరఖాస్తులు ఆహ్వానం

అనకాపల్లి రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సొంతంగా వ్యాపారం చేసుకునేందుకు, గుర్తింపు పొందిన ప్రైవేటు సంస్థల ద్వారా పనిచేసుకునేందుకు సొంతంగా మోటరైజ్డ్ మూడు చక్రాల వాహనం కలిగి ఉన్న దివ్యాంగులకు పెట్రోల్/ డీజిల్ సబ్సిడీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు జీవీబీ జగదీష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్సిడీ పొందేందుకు దరఖాస్తు ఫారంతో పాటు సదరం సర్టిఫికెట్, రేషన్‌కార్డు (బియ్యం కార్డు), బ్యాంకు పాస్ పుస్తకం (మొదటి పేజీ), ఆధార్ కార్డు, వ్యాపారం లేదా ఇతర సంస్థల్లో పని చేస్తున్నట్లు ధ్రువీకరణ పత్రం, డ్రైవింగ్ లైసెన్సు, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు జత చేయాల్సి ఉంటుందని వివరించారు. అర్హత కలిగిన అనకాపల్లి జిల్లాలోని దివ్యాంగులు (శారీరక వైకల్యం) నిర్దీత దరఖాస్తు ఫారాన్ని పూరించి సహాయ సంచాలకులు, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు వయో వృద్ధుల సంక్షేమశాఖ కార్యాలయానికి ఈ నెల 25వ తేదీలోగా అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు సహాయ సంచాలకులు, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ, ఎన్టీఆర్ ఆస్పత్రి ప్రాంగణం, అనకాపల్లి జిల్లా కార్యాలయం లేదా ఫోన్ నంబరు 88011 05906లో సంప్రదించాల్సిందిగా కోరారు.

నర్సీపట్నంలో యువకుడి హత్య

... 5వ పేజీ తరువాయి

సోమవారం మీడియాకు వివరించారు.

కోటవురట్ల మండలం రామచంద్రపాలెం గ్రామానికి చెందిన సర్వసిద్ధి నాగేశ్వరరావు(33) ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఇతని అత్తవారిది నర్సీపట్నం మండలం గురందొరపాలెం. ఉపాధి రీత్యా చాలా కాలం నుంచి నాగేశ్వరరావు నర్సీపట్నంలోని కొత్తవీధిలో భార్యాబిడ్డలతో నివాసం వుంటున్నాడు. మూడేళ్ల కుమార్తె వుండగా, ఐదు నెలల క్రితం భార్య నాగలక్ష్మి పురుడు పోసుకోవడానికి పుట్టింటికి వెళ్లింది. తరువాత కుమారుడు పుట్టాడు. ప్రస్తుతం భార్య, ఇద్దరు బిడ్డలు గురందొరపాలెంలో వుంటున్నారు. నాగేశ్వరరావు కొత్తవీధిలోనే వుంటూ అప్పుడప్పుడు అత్తవారింటికి వెళ్లి వస్తున్నాడు. ఆదివారం గురందొరపాలెం వెళ్లిన నాగేశ్వరరావు రాత్రయిన తరువాత అక్కడ నర్సీపట్నం టౌన్‌కు చెందిన ఇందల శంకర్, కాపు వీధికి చెందిన సియాద్రి వెంకట సురేశ్‌తో కలిసి నాగేశ్వరరావు మద్యం సేవించాడు. రాత్రి 11 గంటల సమయంలో ముగ్గురూ కలిసి బైక్‌పై నర్సీపట్నం కొత్తవీధికి బయలుదేరారు. ఎంపీపీ స్కూల్ సమీపంలోకి వచ్చే సరికి అక్కడ స్థానికులైన బండారు సంతోష్ (పోలీసు రికార్డుల్లో రౌడీషీటర్‌గా నమోదైంది), బండారు కొండబాబు మద్యం సేవిస్తున్నారు. వీరు బైక్‌ను ఆపి ఇటువైపు ఎందుకు వచ్చారని నాగేశ్వరరావును ప్రశ్నించారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం మొదలైంది. గొడవ ముదురుతుండడంతో ఇందల శంకర్ సర్దుబాటు చేసి ముగ్గురూ కలిసి బైక్‌పై నాగేశ్వరరావు ఇంటికి వెళ్లారు. అక్కడ అతనిని దిగబెట్టిన తరువాత తిరిగి వెళుతుండగా బండారు సంతోష్ మళ్లీ అడ్డగించి గొడవకు దిగి, మెడ మీద సిగరెట్‌తో కాల్చాడు. దీంతో శంకర్ తిరిగి నాగేశ్వరరావు ఇంటికి వెళ్లి ఈ విషయం చెప్పాడు. ఇద్దరూ కలిసి మళ్లీ బైక్‌పై సంతోష్, కొండబాబులు వున్న చోటుకు వచ్చారు. సిగరెట్‌తో ఎందుకు కాల్చావని నాగేశ్వరరావు నిలదీయగా మళ్లీ ఇరువురి మధ్య గొడవ జరిగింది. సంతోష్ కర్రతో బలంగా నాగేశ్వరరావు మెడ మీద కొట్టడంతో కిందపడిపోయాడు. దీంతో శంకర్ కొత్తవీధిలోకి వెళ్లి నాగేశ్వరరావు బంధువులను పిలుచుకువచ్చాడు. ఈలోగా సంతోష్, కొండబాబు అక్కడి నుంచి వెళ్లిపోయారు. నాగేశ్వరరావును ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు. సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం ఉదయం ఏరియా ఆస్పత్రికి, సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. నాగేశ్వరరావు మేనమామ పల్లా అప్పన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు బండారు సంతోష్, బండారు కొండబాబులపై కేసు నమోదు చేశారు. పట్టణ సీఐ గోవిందరావు, రూరల్ సీఐ రేవతమ్మ ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. రాయల్ రిసార్ట్స్ కూడలి వద్ద సంతోష్‌ని, మాకవరపాలెం శివారులో కొండబాబుని అరెస్టు చేశారు. మృతుడు నాగేశ్వరరావుకి చెందిన సెల్ ఫోన్, బైక్ తాళం కొండబాబునుంచి స్వాధీనం చేసుకున్నారు. కొత్త వీధిలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసి, రాత్రి పెట్రోలింగ్ పెంచారు.

పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా

నాగేశ్వరరావు హత్యకు గురైన విషయం తెలుసుకున్న అతని కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు రామచంద్రపాలెం, గురందొరపాలెం గ్రామాల నుంచి పెద్ద ఎత్తున నర్సీపట్నం చేరుకున్నారు. నాగేశ్వరరావు మృతదేహం వున్న ప్రాంతీయ ఆస్పత్రి, పట్టణ పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	90.00
లైవ్ ధర	110.00
విత్ స్కిన్	190.00
స్కిన్ లెస్	200.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

భూ కబ్జా యత్నాలకు రెవెన్యూ బ్రేకులు

- బాటజంగాలపాలెంలో 5.37 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణ
- పలు రకాల మొక్కలు నాటిన కబ్జాదారులు
- అజ్ఞాత వ్యక్తి ఫిర్యాదుతో స్పందించిన అధికారులు
- ఆక్రమణదారులపై కేసు నమోదు చేయాలని ఆర్డీవో ఆదేశం



బాటజంగాలపాలెంలో కబ్జాకు గురైన భూమిని పరిశీలిస్తున్న ఆర్డీవో షేక్ ఆయేషా, తహసీల్దార్ చిన్నికృష్ణ

సబ్బవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాటజంగాలపాలెంలో ఆరు వరుసల జాతీయ రహదారికి సమీపంలో కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జాను రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. భూమిలో నాటిని మొక్కలను పీకివేశారు. స్థానిక తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. బాటజంగాలపాలెంలో 185 సర్వే నంబరులో ఖాళీగా వున్న 5.37 ఎకరాల వాగు పోరంబోకు/ప్రభుత్వ భూమిపై అక్రమార్కుల కళ్లు పడ్డాయి. రెండు, మూడు రోజుల క్రితం ఈ భూమిని చదును చేసి కొబ్బరి, యూకలిప్టస్, గంధం మొక్కలు నాటారు. దీనిపై ఒక అజ్ఞాన వక్తి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, మండల సర్వేయర్ ఎల్.అప్పారావు, ఆర్ఐ వీరయ్య సోమవారం సర్వే నంబరు 185లో వున్న ప్రభుత్వ భూమిని సందర్శించారు. సర్వే చేయించిన అధికారులు.. గెడ్డవాగు భూమిని ఆక్రమించి, మొక్కలు నాటినట్టు గుర్తించారు. అనంతరం మొక్కలను తొలగించారు. కొద్దిసేపటి తరువాత అనకాపల్లి ఆర్డీవో షేక్ ఆయేషా ఇక్కడకు వచ్చి భూమిని పరిశీలించారు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ భూమి ఆక్రమణకు పాల్పడిన వారిని గుర్తించి భూ కబ్జా చట్టం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి విలువ సుమారు రూ.15 కోట్లు ఉంటుందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

ప్రజల సమస్యలకు మండల స్థాయిలోనే పరిష్కారం

- అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం
- జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌లో 324 అర్జీలు స్వీకరణ



అర్జీదారుల సమస్యను ఆలకిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలకు మండల స్థాయిలోనే పరిష్కారం చూపాలని కలెక్టర్ విజయకృష్ణన్, జాయింట్ కలెక్టర్ జాహ్నవి పలు శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో కలెక్టర్, జేసీ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఇక నుంచి ప్రతి సోమవారం మండల కేంద్రాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను నిర్వహించి ప్రజల సమస్యలను కిందిస్థాయిలోనే పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. అన్ని శాఖల మండలస్థాయి అధికారులు పీజీఆర్ఎస్‌లో పాల్గొని ప్రజల సమస్యలపై దృష్టి సారించాలన్నారు. కాగా సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 324 అర్జీలు అందినట్టు కలెక్టరేట్ సిబ్బంది తెలిపారు.

జిల్లా పోలీస్ కార్యాయలంలో...

అనకాపల్లి రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎస్పీ తుహిన్ సిన్హా అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్జీదారుల వినతులపై స్పందించి సత్వరమే వారికి న్యాయం చేయాలని కిందిస్థాయి పోలీసు అధికారులను ఆదేశించారు. ఆస్తి వివాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు, తదితర వాటికి సంబంధించి 40 అర్జీలు అందినట్టు ఎస్పీ కార్యాలయం సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ దేవప్రసాద్, ఎస్ఐ వెంకన్న పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో మెగా పవర్ ప్లాంట్

... 5వ పేజీ తరువాయి

మంజూరు చేసింది. అయితే ప్రతిపాదిత విద్యుత్ ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో చిన్నపాటి సెలయేర్లు, కాలువలు వున్నాయంటూ కేంద్ర పర్యావరణ శాఖ తొలుత అనుమతులు ఇవ్వలేదు. దీంతో చంద్రబాబునాయుడు అప్పటి పర్యావరణ శాఖ మంత్రిని కలిసి అనుమతులు ఇచ్చేలా కృషి చేశారు. దీంతో ప్లాంట్ యాజమాన్యం రూ. 14.2 కోట్ల వ్యయంతో స్థలం చుట్టూ 12 కిలోమీటర్ల మేర ప్రహరీ గోడను నిర్మించింది. ప్లాంట్ నిర్మాణం ప్రారంభం కాబోయే సమయానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సఖ్యత చెడింది. దీంతో కేంద్రం విదేశాల నుంచి బొగ్గును దిగుమతి చేసుకోవడం వీలుకాదని కేంద్రం ప్రకటించింది. దీంతో దేశీయ బొగ్గునే కేటాయించాలని ఎన్‌టీపీసీ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది.

ఇదే సమయంలో ఎన్నికలు జరిగి రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఎన్‌టీపీసీకి కేటాయించిన భూమిని స్వాధీనం చేసుకొని ఫార్మా కర్మాగారాలకు విక్రయించడానికి చర్యలు చేపటట్టింది. ఇందులో భాగంగా ఏపీఐఐసీ ద్వారా ఎన్‌టీపీసీకి నోటీసులు జారీ చేయించింది. తాము భూమికి డబ్బులు చెల్లించామని, రాష్ట్రంలో ఎక్కడైనా ఆరు వేల ఎకరాలు కేటాయిస్తే ఇక్కడ భూమిని వదులుకుంటామని యాజమాన్యం స్పష్టం చేసింది.

ఇందుకు నిరాకరించిన వైసీపీ ప్రభుత్వం.. విద్యుత్ కేంద్రం నిర్మాణానికి ఇచ్చిన అనుమతులు రద్దు చేయిస్తామని ఏపీఐఐసీ ద్వారా నోటీసులు జారీ చేసింది. భూమి కోసం గతంలో తాము చెల్లించిన రూ.700 కోట్లతోపాటు తాము ఇంతవరకు చేసిన ఖర్చును తిరిగి చెల్లించాలని ఎన్‌టీపీసీ యాజమాన్యం షరతు విధించింది. దీంతో ప్రభుత్వం మిన్నకుండిపోయింది.

ఈ క్రమంలో సాధారణ ఎన్నికలు జరిగి వైసీపీ ఘోరంగా ఓడిపోయి, టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడింది. దీంతో ఎన్‌టీపీసీ విద్యుత్ ప్లాంట్‌కు మళ్లీ కదలిక వచ్చింది. అయితే మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా, కాలుష్యరహితంగా విద్యుత్ ప్లాంట్ నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం, ఎన్‌టీపీసీ నిర్ణయించాయి. చంద్రబాబు నాయుడు చొరవతో ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా పట్టాలెక్కబోతున్నది. ఈ నెల 29వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయనున్నట్టు అధికారులు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో గీత కార్మికుడి మృతి



పోతురాజు(ఫైల్ ఫొటో)

అచ్యుతాపురం రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని సెజ్ పునరావాస కాలనీకి చెందిన కల్లుగీత కార్మికుడు సోమవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీనికి సంబంధించి సీఐ నమ్మి గణేశ్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. సెజ్ కాలనీకి చెందిన బత్తిన పోతురాజు(65) సెజ్ కంపెనీ పరిసరాలలో తన వృత్తి అయిన కల్లుగీత పని ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పోతురాజుకు బలమైన గాయాలయ్యాయి. స్థానిక ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించిన వైద్య సిబ్బంది పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో అనకాపల్లి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుని కుమారుడు బత్తిన రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైతులకు మేలు చేకూరేలా పనిచేయాలి

- దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ సదస్సులో ఉన్నతాధికారులు

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్ర జ్యోతి): దేశంలోని రైతులకు మేలు చేకూ ర్చడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలుచేస్తున్నాయని, వీటిని రైతుల చెంతకు చేరేలా చూడాల్సిన బాధ్యత ఈశాఖపై ఉందని అధికారులు పేర్కొన్నారు. వ్యవసాయరంగంలో నూతన ఆవిష్కరణలు, సంస్కరణలు, ప్రాజెక్టులు, భవి ష్యత్తు కార్యాచరణపై చర్చించేందుకు రాడిసన్ బ్లూ హోటల్‌లో సోమవారం దక్షి ణాది రాష్ట్రాల ప్రాంతీయ సదస్సు ప్రారంభ మైంది. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ కార్య దర్శి డాక్టర్ దేవేశ్ చతుర్వేది మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రాలు సమన్వయంతో పథకాలు అమలుచేస్తే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు.కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ జాయింట్ సెక్రటరీ పేరిన్ దేవి, కేంద్ర రైతు సంక్షేమ, వ్యవసాయ పథకాలు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ మాట్లాడుతూ రైతుల జీవన విధానాల్లో మార్పులు తీసుకువ చ్చేం దుకు అధికారులు కృషిచేయాలని సూచించారు. ఈ సదస్సుకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ అడిషినల్ సెక్రటరీ సుభా థాకూర్, అదనపు కార్యదర్శి డాక్టర్ ప్రమోద్‌కుమార్ మెహర్దా, కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్, వ్యవసాయశాఖ అధికా రులు, ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళ నాడు, కేరళ రాష్ట్రాలు, పుదుచ్చేరి నుంచి వ్యవసాయ రంగ నిపుణులు, అధికారులు హాజరయ్యారు.

రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు ఏసీ కోచ్‌లు

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): భువనేశ్వర్- బెంగళూరు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్-తిరుపతి రైళ్లలకు తాత్కాలికంగా థర్డ్ ఏసీ అదనపు కోచ్‌లు జతచేస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 22 నుంచి 30 వరకు, తిరుగు ప్రయాణంలో ఈ నెల 23 నుంచి డిసెంబరు 1 వరకు, భువనేశ్వర్-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 23 నుంచి 30 వరకు, తిరుగు ప్రయాణంలో ఈ నెల 24 నుంచి డిసెంబరు 1 వరకు ఈ కోచ్‌లు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

మళ్లింపు మార్గంలో పలు రైళ్లు

విజయవాడ డివిజన్‌లో భద్రతా పనుల నేపథ్యంలో పలు రైళ్లు మళ్లింపు మార్గంలో నడుస్తాయని సీనియర్ డీసీఎం తెలిపారు. ఈ నెల 19, 23, 25, 30న ధనబాద్-అలెప్పీ బొకారో, 21, 28న టాటా-యశ్వంత్‌పూర్, 20, 27న జసిదిహ్-తాంబరం, 25న హటియా-ఎర్నాకుళం, 23, 30న హటియా-ఎస్ఎంవీ బెంగళూరు, 19, 26న హటియా-బెంగళూరు, 22, 29న టాటానగర్-బెంగళూరు, 28న విశాఖ-సాయినగర్, 29న విశాఖ-నిజాముద్దీన్ స్వర్ణ జయంతి రైళ్లు నిడదవోలు, భీమవరం మీదుగా నడుస్తాయని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా రేపు

అనకాపల్లి టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 20వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎన్.గోవిందరావు తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుకుని 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసుగల యువతీ యువకులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చనన్నారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగులు తమ వివరాలను నైపుణ్యం ఏపీ జీటీవి.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. ఆధార్‌కార్డు, విద్యార్హత సర్టిఫికెట్‌లతో బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో హాజరుకావాలని, మరిన్ని వివరాలకు 81432 29228 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని ఆయన కోరారు.

కలెక్టరేట్ వద్ద ఆశ వర్కర్ల ధర్నా

... 5వ పేజీ తరువాయి

ఇవ్వాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ, ఆశ కార్యకర్తలను ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆరోగ్య ఉపకేంద్రాలు, సచివాలయాల్లో ఉంచడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, ఆశ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.శాంతి, ఇ.పార్వతి, రాష్ట్ర కార్యదర్శి వి.సత్యవతి, జిల్లా ప్రతినిధులు కె.వరలక్ష్మి, బి.రామలక్ష్మి పాల్గొన్నారు.